



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 230 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 26 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 230 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 26 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## నీళ్లు ఆపేస్తే మోదీ శ్వాస ఆపేస్తాం..

- నీళ్లు ఆపేస్తే ఊరుకుంటామా... నీ శ్వాస ఆపేస్తాం... హిందువుల రక్తం పారిస్తాం: ప్రధాని మోదీకి హఫీజ్ సయీద్ వార్నింగ్
- ఇస్లామాబాద్ సభలో హఫీజ్ సయీద్ సంచలన వ్యాఖ్యలు
- పాకిస్థాన్‌కు నీళ్లు ఆపుతావా అంటూ మండిపాటు
- కశ్మీర్‌లో డ్యాం కట్టి నీళ్లు ఆపితే మేం ఊరుకుంటామా అని ఆగ్రహం

**పెన్ పవర్ డెస్క్:**"నీళ్లు ఆపేస్తే మోదీ శ్వాస ఆపేస్తాం. కశ్మీర్ నదుల్లో హిందువుల రక్తం పారిస్తాం. యుద్ధం మొదలు పెడతాం. మీ అంతు చూస్తాం" అంటూ వరల్డ్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన సభలో అతడు ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌కు నీళ్లు ఆపుతారా, మీ ఊపిరి ఆపేస్తాం జాగ్రత్త అంటూ హఫీజ్ సయీద్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి హెచ్చరించాడు. సింధూ నదిలో నీళ్లకు బదులు

వివరాలు 2లో..

## పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం పవన్

- సొంత నియోజకవర్గంపై పవన్ కల్యాణ్ దృష్టి
- 30 పడకల ఆసుపత్రిని మరింత అప్ గ్రేడ్
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో పిఠాపురంను మరింత అభివృద్ధి చేస్తామన్న పవన్



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, పిఠాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచుతూ చేపట్టిన నిర్మాణ పనులకు ఆయన నేడు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 30 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి పిఠాపురం టీడీపీ ఇన్చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల నాయకత్వంలో పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. 30 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పెంచడం ఈ అభివృద్ధి ప్రస్థానంలో ఒక భాగమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన ఉద్ఘాటించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి పని చేస్తున్నాం" అని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.పిఠాపురంలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి స్థాయిని పెంచుతున్నామని, దీనివల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఐడీ కస్టడీకి మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు



**పెన్ పవర్ డెస్క్:**బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీని వేధింపులకు గురిచేసిన కేసులో మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్న పీఎస్ఆర్ ను తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ అధికారులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ పై కోర్టు సానుకూలంగా స్పందించింది.

వివరాలు 2లో..

## 'మత్స్యకారులకు చేయూత'.. ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:** శ్రీకాకుళం జిల్లాలో సీఎం చంద్రబాబు దశనివారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో 'మత్స్యకారులకు చేయూత' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సముద్రంలో వేటకు విరామం సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ. 20వేలు చొప్పున అందించనున్నారు. దీని ద్వారా 1,29,178 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు

వివరాలు 2లో..

## కోనసీమ జిల్లాలో... సీబీఐ అధికారులం అంటూ రూ.30 లక్షలకు టోకరా



- కోనసీమ జిల్లా కొత్తపేటలో భారీ సైబర్ మోసం
- విశ్రాంత ఉద్యోగినిని లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు
- సీబీఐ అధికారులమని ఫోన్, వీడియో కాల్‌తో బెదిరింపు
- కుమారులను చంపుతామని భయపెట్టి రూ.30 లక్షల వసూలు
- బాధితురాలి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

**పెన్ పవర్ డెస్క్:**అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సైబర్ నేరగాళ్లు తెగబడ్డారు. తాము సీబీఐ అధికారులమని బెదిరించి, ఓ విశ్రాంత ఉద్యోగిని నుంచి ఏకంగా రూ. 30 లక్షలు కాజేశారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళితే, కొత్తపేటకు చెందిన ఓ మహిళ ఇటీవల రిటైర్ అయ్యారు. ఆమె తన బ్యాంకు ఖాతాలో సుమారు రూ.30 లక్షల నగదు జమ చేశారు.

వివరాలు 2లో..

## ఉగ్రదాడిలో జనసేన క్రియాశీలక సభ్యుడు మరణించడం బాధాకరం

- ఏలూరు పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించిన జనసేన
- ఉగ్రదాడిలో మధూసూధన్ మరణించడం బాధాకరమని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ ఏలూరు పాత బస్టాండ్ వద్ద జనసేన సభ్యులు మానవహారం నిర్వహించారు. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో మానవహారం నిర్వహించామని చెప్పారు.

వివరాలు 2లో..

## అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించిన చంద్రబాబు

- ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన
- ప్రధాని మోదీతో సమావేశం
- వివిధ అంశాలపై చర్చ



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు గంటన్నర పాటు సాగింది. ఈ సందర్భంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా మే 2వ తేదీన తలపెట్టిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు

వివరాలు 2లో..

## ఈ సమయంలో ఇరు దేశాలు సంయమనం పాటిస్తే బెటర్

- పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన ప్రపంచ దేశాలు
- పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్న ఐక్యరాజ్యసమితి
- ఉద్రిక్తతల వేళ పాక్, భారత్ సంయమనం పాటించాలన్న ఐరాస

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన పాశవిక ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్న విషయం తెలిసిందే. పర్యాటకులపై ముష్కరులు తూటాల వర్షం కురిపించడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయిన



వివరాలు 2లో..

## ఎన్నారైలపై జగన్ విషం చిమ్ముతున్నారు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

- వైసీపీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందన్న చిన్ని
- ఈ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు
- అమరావతికి నిధులు రాకుండా జగన్ అడ్డుకుంటున్నారని విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ హయాంలో ఏపీలో భారీ మద్య కుంభకోణం జరిగిందని విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపించారు. మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.



వివరాలు 2లో..

## నలుగురు కాదు... విజయవాడలో 10 మంది ఉగ్రవాదులు?

- ఏపీ రాజధాని ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలు
- నలుగురు ఉగ్రవాదులు ఉన్నట్లు రెండు నెలల క్రితం హెచ్చరించిన కేంద్ర నిఘా వర్గాలు
- మరో ఆరుగురు ఉన్నట్లు గుర్తించిన స్థానిక పోలీసులు



**పెన్ పవర్ డెస్క్:**విజయవాడలో నిషేధిత సిమి (స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా) సానుభూతిపరుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కేంద్ర నిఘా సంస్థల నుంచి అందిన నిర్దిష్టమైన సమాచారం మేరకు, నగరంలో పది మంది అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

సుమారు రెండు నెలల క్రితం, కేంద్ర నిఘా వర్గాలు నలుగురు అనుమానిత సిమి సానుభూతిపరులకు సంబంధించిన వివరాలను విజయవాడ పోలీసు కమిషనరేట్ అధికారులకు అందించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ సమాచారాన్ని అందుకున్న స్థానిక పోలీసులు, తమదైన శైలిలో దర్యాప్తును ముమ్మరం చేసి, మరో ఆరుగురు

వివరాలు 2లో..

## బోరుగడ్డ అనిల్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- బోరుగడ్డ అనిల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ తిరస్కరణ
- సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ, పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- గతంలో హైకోర్టును తప్పుదోవ పట్టించారనే కారణంతో తిరస్కరణ
- హైకోర్టులోనే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచన.



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ మద్దతుదారుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కు సుప్రీంకోర్టులో తీవ్ర నిరాశ ఎదురైంది. బోరుగడ్డ అనిల్ కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. గతంలో మధ్యంతర బెయిల్ పొందిన సమయంలో న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించారనే కారణంతో ఈ పిటిషన్‌ను కొట్టివేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో బెయిల్ కోసం బోరుగడ్డ అనిల్ మళ్లీ హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయనకు తక్షణ ఉపశమనం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రారెత్తిస్తున్న ఎండలు

ఆంధ్రప్రదేశ్ లో ఎండలు భగ్గుమంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల దెబ్బకు జనం రారెత్తిపోతున్నారు. ఏప్రిల్ నెలలోనే రోహిణి కార్తెను తలపిస్తుంది. ఒకవైపు ఎండలు కాస్తుండగా, మరోవైపు అక్కడక్కడా వర్షాలు పడతాయని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతాయని కూడా తెలిపింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటడంతో నేడు, రేపు నలభై ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరే అవకాశముందని కూడా పేర్కొంది. సాధారణంకంటే మరో రెండు డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అమరావతి వాతావరణ శాఖ కేంద్రం అలెర్ట్ జారీ చేసింది.

**అప్రమత్తం చేసిన...**

ప్రధానంగా వృద్ధులు, చిన్నారులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఇళ్ల నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ఉదయం పది గంటలనుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఎవరూ బయటకు రాకపోవడమే మంచిదని, వడదెబ్బ తగిలే అవకాశముందని కూడా వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఇదే సమయంలో ఈరోజు, రేపు ఉత్తర,కోస్తాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడతాయని, దక్షిణ కోస్తాల్లో లో మాత్రం నేడు పొడి వాతావరణం నెలకొని ఉంటుందని చెప్పింది. రాయలసీమలో బలమైన ఈదురుగాలులుతో కూడిన వర్షాలు పడతాయని కూడా చెప్పింది.

**గరిష్ట స్థాయిలో...**

తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. ఎండల తీవ్రత మరో రెండు రోజుల్లో అధికం కానుందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని పేర్కొంది. ఈరోజు కూడా ఉత్తర్ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని తెలిపింది. రాత్రి వేళ వాతావరణం మరింత పొడిగా మారి వేడెక్కనుందని, ఉక్కపోత కూడా ఎక్కువ కానుందని వాతా

వాతావరణ శాఖ చెప్పింది. అయితే అదే సమయంలో ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని, అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు ఈదురుగాలులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది.

# కోనసీమ జిల్లాలో... సీబీఐ అధికారులం అంటూ రూ.30 లక్షలకు టోకరా

- మొదటి పేజీ తరువాయి

ఈ లావాదేవీని సైబర్ నేరగాళ్లు పసిగట్టారు. అనంతరం, వారు సదరు మహిళ వ్యక్తిగత వివరాలు సేకరించారు. ఆ తర్వాత, ఆమెకు ఫోన్ చేసి తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. ఓ కేసు విషయంలో ఆమె ప్రమేయం ఉందని, తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నమ్మబలికారు. అంతటితో ఆగకుండా, ఆమెకు వీడియో కాల్ చేసి, తాము చెప్పినట్లు డబ్బు ఇవ్వకపోతే ఆమె కుమారులను హతమారుస్తామని తీవ్రంగా బెదిరించారు. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు, వారు చెప్పిన సూచనల మేరకు ఆన్‌లైన్ ద్వారా విడతలవారీగా రూ.30 లక్షల మొత్తాన్ని వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. డబ్బు మొత్తం బదిలీ చేసిన తర్వాత, అనుమానం వచ్చి ఆరా తీయగా తాను మోసపోయానని బాధితురాలు ఆలస్యంగా గ్రహించారు. వెంటనే తేరుకుని, జరిగిన మోసంపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

# నీళ్లు ఆపేస్తే మోదీ శ్వాస ఆపేస్తాం..

- మొదటి పేజీ తరువాయి

మీ రక్తం పారిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశాడు. మేం బంగ్లాదేశ్‌ను విడదీశామని ఢాకాలో నిలబడి చెబుతున్నారా? అని మోదీపై ధ్వజమెత్తాడు. ఇందుకోసం నువ్వా రక్తం ఇచ్చావని చెబుతున్నావ్ కదా అంటూ తీవ్ర విమర్శలు గుప్పించాడు. మేం మౌనంగా ఉండేది లేదని, నువ్వు అంటే మేమూ అంటామని హఫీజ్ సయీద్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. కశ్మీర్‌లో డ్యాం కట్టి పాకిస్థాన్‌కు నీళ్లు ఆపుతారా, మేం ఊరుకుంటామని అనుకుంటున్నారా? అని మండిపడ్డాడు.

# ఈ సమయంలో ఇరు దేశాలు సంయమనం పాటిస్తే బెటర్

- మొదటి పేజీ తరువాయి

ఈ భీకర దాడిని ఐక్యరాజ్యసమితి కూడా ఖండించింది. ఈ నేపథ్యంలో ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ఈ ఉగ్రవాద దాడిని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన... ఈ సమయంలో పాక్, భారత్ సంయమనం పాటించాలని సూచించారు.

గురువారం మీడియాతో మాట్లాడిన స్టీఫెన్ దుజారిక్... "జమ్మూలో టూరిస్టులపై జరిగిన పాశవిక ఉగ్రదాడిని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి అనేది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. భారత్, పాక్ సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

ఇక, ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందంటూ ఆరోపించిన భారత్... సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే విషయమై స్టీఫెన్ దుజారిక్‌ను విలేకరులు ప్రశ్నించారు. ఈ ఉద్రిక్తతల వేళ నిబంధనలపై రెండు దేశాలు సంయమనం పాటించి, పరిస్థితులు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.

# అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించిన చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

కావాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని, వాటికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండడం తెలిసిందే. ఇందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసింది. ప్రధానితో చంద్రబాబు భేటీలో అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి, రాష్ట్రానికి సంబంధించిన ఇతర కీలక ప్రాజెక్టులు, ఆర్థిక వనరులు, విభజన హామీలు వంటి పలు అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర సహకారం ఆశిస్తున్నట్లు సీఎం ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. ప్రధానితో భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు సమాచారం.

**మోదీ రాక... భారీ ఏర్పాట్లకు ప్రణాళికలు**

అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెలగపూడిలోని

సచివాలయం వెనుక భాగంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే రోజున దాదాపు 30 వేల మందితో ఒక రోడ్‌షో నిర్వహించాలని కూడా యోచిస్తున్నారు. ఇందులో మోదీ, చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రారంభమయ్యే లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు సూచికగా ప్రధాని మోదీ ఒక పైలాన్‌ను కూడా ఆవిష్కరించనున్నారు.

# నలుగురు కాదు... విజయవాడలో 10 మంది ఉగ్రవాదులు?

- మొదటి పేజీ తరువాయి

అనుమానితులను గుర్తించినట్లు సమాచారం. దీంతో మొత్తం పది మంది వ్యక్తుల కదలికలపై నిఘా వ్యవస్థను కేంద్రీకరించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ పది మంది అనుమానితులు నగరంలోని గొల్లపూడి, అశోక్ నగర్, లబ్బీపేట వంటి ప్రాంతాలలో నివాసం ఉంటున్నారని, వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని గుర్తించినట్లు తెలిసింది. అయితే, ఇప్పటివరకూ వీరి నుంచి ఎలాంటి చట్టవ్యతిరేక లేదా అనుమానాస్పద కార్యకలాపాలు తమ దృష్టికి రాలేదని, అయినప్పటికీ వీరిపై నిఘాను నిరంతరం కొనసాగిస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. గతంలో విజయవాడ నగరం మావోయిస్టులకు సైతం కీలకమైన షెల్టర్ జోన్‌గా

నిలిచిన అనుభవాలున్నాయి. ఈ నేపథ్యంలో, తాజా సమాచారంతో భద్రతా యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అనుమానితులపై నిఘా కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# సీఐడీ కస్టడీకి మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు

- మొదటి పేజీ తరువాయి

పీఎస్ఆర్ ను మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కస్టడీకి అనుమతించింది. పీఎస్ఆర్ ను సీఐడీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేసి బుధవారం ఉదయం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. నటి వేధింపుల కేసులో పీఎస్ఆర్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పీఎస్ఆర్ ఆంజనేయులును రిమాండ్‌కు ఇవ్వాలని సీఐడీ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. ముంబై నటి వేధింపుల కేసులో సాక్ష్యాలు తారుమారు చేసేందుకు పీఎస్ఆర్ ప్రయత్నించారని

కోర్టుకు తెలిపారు. నటి వేధింపుల వెనుక ప్రణాళిక అంతా పీఆర్ఎస్ దే అని విశాల్ గున్నీ వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. విశాల్ గున్నీతోపాటు నాటి విజయవాడ సీపీ కాంతిరాణాను సీఎంఓకు పీఎస్ఆర్ పిలిపించారని ముంబై నటిపై తప్పుడు కేసు పెట్టి 42 రోజులు జైలులో ఉంచారని చెప్పారు. దీనిపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని కోర్టుకు వివరణ ఇచ్చారు.

# ఉగ్రదాడిలో జనసేన క్రియాశీలక సభ్యుడు మరణించడం బాధాకరం

- మొదటి పేజీ తరువాయి

ఈ దాడిలో జనసేన క్రియాశీల సభ్యుడు మధుసూధన్ మరణించడం బాధాకరమని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు అందరం కలిసి ముందుకు సాగాలని చెప్పారు. మన దేశం, మన రాష్ట్రం తర్వాతే మనందరం అని అన్నారు. దేశం కోసం, సమాజం కోసం అందరం కలిసి నిలడదామని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ... కశ్మీర్ పర్యటనకు వెళ్లిన వారిని ఉగ్రవాదులు చంపడం దిగ్భ్రాంతికరమని చెప్పారు. తీవ్రవాదాన్ని అందరం కలిసి ఎదుర్కోవాలని అన్నారు.

# బోరుగడ్డ అనిల్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజీ తరువాయి

లభించే అవకాశాలు మూసుకుపోయినట్లయింది.

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో నమోదైన కేసు విచారణ కూడా కొనసాగుతోంది. 2023లో తెలుగుదేశం పార్టీ నాయకురాలు తేజస్విని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు ఇటీవలే అనంతపురం కోర్టులో హాజరుపరిచారు.

# 'మత్స్యకారులకు చేయూత'.. ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం రూ.258 కోట్లు ఖర్చు చేయనుంది.

మధ్యాహ్నం 12.10 గంటలకు సీఎం చంద్రబాబు బుడగట్లపాలెంలోని అమ్మవారిని దర్శనం చేసుకుంటారు. అనంతరం మత్స్యకారులతో ముచ్చటిస్తారు. ఆ తర్వాత 1.50గంటలకు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభకు చేరుకొని మత్స్యకారుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 500 మంది కూటమి కార్యకర్తలతో సమావేశమవుతారు.

# ఎన్నారైలపై జగన్ విషం చిమ్ముతున్నారు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఎన్నారైలపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. ప్రవాసాంధ్రులపై విషం చిమ్మితే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి నిధులు రాకుండా జగన్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కేశినేని చిన్ని ఆరోపించారు. రాష్ట్రానికి, రాష్ట్రంలోని నిరుద్యోగులకు నష్టం చేకూరేలా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

# నేషనల్ హెరాల్డ్ కేసు: సోనియా, రాహుల్ లకు నోటీసులు ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు తక్షణమే నోటీసులు జారీ చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజ్ఞప్తికి ఢిల్లీ కోర్టులో తాత్కాలికంగా బ్రేక్ పడింది. సోనియా, రాహుల్ లకు నోటీసులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈడీ సమర్పించిన పత్రాల్లోని లోపాలను సరిదిద్దాలని, కేసుకు సంబంధించి మరింత నిర్ధారణతో కూడిన సరైన పత్రాలను అందించాలని న్యాయస్థానం దర్యాప్తు సంస్థను ఆదేశించింది."పూర్తిగా సంతృప్తి చెందే వరకు నేను అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేను" అని న్యాయమూర్తి స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ దశలో విచారణను ఆలస్యం చేయవద్దని, నోటీసులు జారీ చేయాలని ఈడీ తరపు న్యాయవాది కోరినప్పటికీ, న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. ఈ మేరకు కేసు తదుపరి విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.నేషనల్ హెరాల్డ్ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏప్రిల్ 9వ తేదీన చార్జిషీట్ దాఖలు చేసిన విషయం విదితమే. సుమారు రూ. 5,000 కోట్ల మేర మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ ఈ చార్జిషీట్‌లో ఆరోపించింది. ఈ పరిణామం సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై క్రిమినల్ విచారణ ప్రారంభించే దిశగా ఈడీ వేసిన కీలక అడుగుగా పరిగణిస్తున్నారు. ఈడీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చార్జిషీట్‌లో ఐదుగురు వ్యక్తులు, రెండు కంపెనీలను నిందితులుగా పేర్కొన్నారు. వీరిలో గాంధీ కుటుంబానికి నియంత్రణ వాటా ఉన్న యంగ్ ఇండియన్ సంస్థతో పాటు, గాంధీ కుటుంబానికి సన్నిహితులుగా భావించే కాంగ్రెస్ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా, సుమన్ దూబే వంటి వారు ఉన్నట్లు తెలుస్తోంది. మనీలాండరింగ్‌కు సంబంధించిన లావాదేవీలు, నిధుల మళ్లింపును ధృవీకరించే పత్రాలను కూడా ఈడీ కోర్టుకు సమర్పించినట్లు సమాచారం.

గత కొన్నేళ్లుగా ఈ కేసుకు సంబంధించి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు దివంగత కాంగ్రెస్ కోశాధికారులు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్‌లను కూడా ఈడీ గతంలో పలుమార్లు ప్రశ్నించింది. వారి వాంగ్మూలాలను కూడా ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో చేర్చినట్లు భావిస్తున్నారు. తాజాగా కోర్టు ఆదేశాలతో, ఈడీ అదనపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. మే 2న జరిగే విచారణలో తదుపరి పరిణామాలు వెల్లడి కానున్నాయి.

# చింతపల్లి లో ప్రపంచ మలేరియా దినోత్సవం







**చింతపల్ల పెన్ పవర్ ఏప్రిల్ 25:-** చింతపల్లి మండల కేంద్రంలో పాత బస్టాండు కూడలిలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు ర్యాలీ నిర్వహించారు దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లయితే దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చునని స్థానిక ఏరియా సూపర్డెంట్ డాక్టర్ ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు అసిస్టెంట్ మలేరియా అధికారి నీలకంఠం నాయుడు ( ఇన్ ఛార్జ్) సబ్ యూనిట్ అధికారులు బి చిట్టిబాబు ఆర్ కన్నబాబు ఈ సందర్భంగా వారు మాట్లాడారు.దోమ సాధారణంగా ఎక్కడపడితే అక్కడ కనిపించే కీటకం అని అన్నారు. దోమలు మనుషుల రక్తం తాగి బతుకు తుందని అన్నారు. దోమలు మనుషుల శరీరంపై వాలి, రక్తం పీల్చినప్పుడు అదే క్రమంలో మన శరీరంలోకి కొన్ని క్రిముల లను కూడా విడుదల చేస్తుందన్నారు.దీని ప్రభావంతో ఎన్నో వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. దోమ కాటు వలన కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.దోమలు కుట్టకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత ముందు జాగ్రత్తలు పాటించాలని, అన్నారు. దోమల వృద్ధి చెందకుండా ఉండా లంటే ఇంటి పరిసరా లను పరి శుభ్రంగా ఉంచుకో వాలని సూచిం చారు.అలాగే గోతులలో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అందులో భాగంగా ఇంటి పరిసరాలలో ఉన్నటువంటి తాగి,పారేసిన కొబ్బరి బోండాలు. పాత టైర్లు, వాడి పారేసిన గ్లాసులు అయితే వాటిలో నీళ్లు లేకుండా చూసుకోవాలని అన్నారు అలాగే అలంకరణ కోసం పెంచుకుంటున్న మనీ ప్లాంట్ లో కూడా నీళ్లను ఎప్పటికప్పుడు మార్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ మేరకు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నట్లయితే దోమలు, దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చునని, అన్నారు.

అనంతరం మండల కేంద్రమైన చింతపల్లిలో వివిధ శాఖల అధికారులతో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో దోమల కుట్టరాదు దోమలు పుట్టరాదు. దోమ తెరలు వాడాలంటూ పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో చింతపల్లి ఇన్ ఛార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి నీలకంఠం నాయుడు, సబ్ యూనిట్ అధికారులు బి చిట్టిబాబు ఆర్ కన్నబాబు, స్థానిక ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆస్పత్రి సిబ్బంది తో పాటు ఎం టి ఎస్ లు యుగంధర్,శ్రావణి సంధ్య,హెల్త్ అసిస్టెంట్ లు సత్యారావు, లక్ష్మణ్ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | మన్యం | విజయనగరం | విశాఖపట్నం | అనకాపల్లి | అల్లూరి జిల్లా

## డీఆర్సీసమావేశంలో చంద్రమౌళి,మధుసూధన రావులకు ఘన నివాళి

### ఉగ్రదాడిని ఖండించిన ఇన్ఛార్జి మంత్రి డీవీబీ స్వామి, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, ఏప్రిల్ 25** :కశ్మీర్ – పెహల్గాం జిల్లాలో జరిగిన ఉగ్రవాదుల దాడి ఘటనలో మృత్యువాత పడిన జె.ఎస్. చంద్రమౌళి, మధుసూధన రావులకు విశాఖపట్ట ణం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి,ఎం. పీ భరత్, ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా, వంశీ, వెలగపూడి, విష్ణుకుమార్ రాజు, వీఎం ఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, సీతంరాజు సుధా కర్, గండి బాబ్జీ, జేసీ, వీఎంఆర్డీఏ కమిషనర్, ఇతర అధికారులు లేచి నిల్చొని రెండు నిమిషా లు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యు లకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇన్ఛార్జి మంత్రి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దా డి ఘటనను ఖండించారు. దేశ ప్రధాని తీసుకు నే నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని, జాతి సమైక్యతకు అనుగుణంగా వ్యవహరిం చాలని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిం చిన కలెక్టర్, సీపీ





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, ఏప్రిల్ 25 :-** శనివారం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. శ్రీకాకుళంలో జరిగే మత్స్యకార సేవ పథక నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా బీచ్ రోడ్లో ఉన్న కోస్టల్ బ్యాక్టరీకి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. అక్కడ నుంచి ఆంధ్రా మెడికల్ కాలేజీకి వెళ్లి ఆంధ్రా మెడికల్ కాలేజీ అలుమ్ని ఆధ్వర్యంలో నిర్మించిన సెంటినరీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం రోడ్ మార్గం ద్వారా ఎయిర్పోర్ట్ కు అక్కడ నుంచి అమరావతి చేరుకుంటారు.

ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సంబంధిత ఏర్పాట్లను సీపీతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

## గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలి

- చలి వేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలిలి
- ఉదయం 10గం.ల్లోగా శత శాతం పింఛన్లు పంపిణీ కావాలి..
- పీజీఆర్ఎస్, ఉపాధి హామీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




**కురుపాం /పార్వతీపురం,పెన్ పవర్, ఏప్రిల్ 25 :** జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణాల్లో ప్రతివారం పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, హౌసింగ్, నరేగా, తాగునీటి సమస్యలు,గ్రామ/వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పెన్షన్ పంపిణీ, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం జన్ మన్ కింద చేపట్టిన గృహాలకు 50వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా మంజూరు చేస్తున్నప్పటికీ ప్రగతి కనిపించడం లేదన్నారు. ఏ పథకానికి లేనివిధంగా ఈ పథకానికి నిధులు కొరత కూడా లేదన్నారు. చేపట్టిన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు కూడా త్వరగా చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ గుర్తుచేశారు. జిల్లాలోని లే అవుట్లలో నిర్మితమవుతున్న గృహాల్లో ఆర్సీ, ఆర్ఎల్ స్టేజీలో 3,149 గృహాలు ఉన్నాయని, వాటిపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈఈలు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో వారం వారం పురోగతి ఉండాలని, ప్రతి వారం 100 గృహాలకు పైగా ప్రారంభమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. కొన్ని లే అవుట్లలో నీటి సమస్య ఉందని, వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు ఇది అనువైన సమయమని, కావున గృహ నిర్మాణాలన్నీ ఆగస్టు నాటికి పూర్తికావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు.

జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, కావున చలివేంద్రాలు అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాలు, ఉపాధి హామీ, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు కచ్చితంగా ఉండాలని, వాటిని పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎవరికి వడదెబ్బ తగల కూడదని, అలా జరిగితే సంబంధిత ఆర్.డబ్ల్యూ.ఎస్, ఎంపిడీ ఓ, ఎంఆర్ఓలను బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే ఎక్కడా కూడా తాగునీటి సమస్య ఉండరాదని, ఎప్పటికప్పుడు బోర్ వెల్స్ కు మరమ్మతులు చేపట్టడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని తెలిపారు. పశువుల కొరకు నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వాటికి కూడా నీటిని అందించాలని అన్నారు. ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో పింఛనుదారులు అసంతృప్తి చెందకుండా ప్రతి మండలంలోని ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ రోజున పాల్గొని ఉదయం 7.00గం.ల నుంచి 10.00గం.ల్లోగా శత శాతం పంపిణీ కావాలని అన్నారు. జిల్లాలో 1,521 కొత్తగా వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయని, కావున ఆయా మండలాల్లోని కొత్త పింఛన్ల సొమ్మును కూడా ముందుగా డ్రా చేసుకోవాలని తెలిపారు. అలాగే లబ్ధిదారులకు ముందుగా పింఛను గురించి తెలియజేసి, ప్రజాప్రతినిధులతో కొత్త పింఛన్లను పంపిణీ చేసేలా చర్యలు తీదుకోవాలని కలెక్టర్ వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వతమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న క్యాంపేయిన్లలో ఇచ్చిన లక్ష్యాలను శత శాతం సాధించాలని, లేకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో చెరువు గట్లు పనులతో పాటు ఫారం పాండ్స్ కు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జిల్లాలో ఉపాధి హామీ ద్వారా అన్ని పనులు చేసుకునే సౌలభ్యం ఉందని, అలాగే ఇది తగిన సమయం అయినందున ఫారం పాండ్స్, చెక్ డ్యాములు, గోశాలలు తదితర ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, హౌసింగ్, డిఆర్డిఏ, డ్వామా పీడీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి ఇ.అప్పన్న, ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్.డబ్ల్యూ.ఎస్, హౌసింగ్,పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్ పవర్ వార్త పత్రిక కథనాన్ని స్పందించిన పశు వైద్యాధికారులు





- కడుతుల గ్రామంలో పశు వైద్యశిబిరం ఏర్పాటు.
- పశువులకు టీకాలు వేసిన పశు వైద్య సిబ్బంది.

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 25.** పది రోజుల వ్యవధిలో కడుతుల గ్రామంలో 12 మూగ జీవాలు మృతి చెందాయని పెన్ పవర్ పత్రికల్లో వచ్చిన కథనాలకు సంబంధిత అధికారులు స్పందించారు. శుక్రవారం పశు వైద్యాధికారి రవి ఆధ్వర్యంలో పనసపుట్టు పంచాయతీ, కడుతుల గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గొంతు వ్యాధి నివారణ టీకాలు వేసి, రైతుల పశువులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాలతో ఉన్న పశువులను గుర్తించి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపడం జరిగిందని పశు వైద్యాధికారి రవి తెలిపారు. వరుసగా రెండు రోజులు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేయించిన మండల అభివృద్ధి అధికారి వి సూర్యనారాయణ మూర్తి కు, తమ మూగ జీవాల మరణాలపై వార్త పత్రికలో ప్రచురించి అదికారులు దృష్టికి తీసుకువెళ్లిన పాత్రికేయులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి రవితో పాటు పశుసంవర్ధక విస్తరణ అధికారి ఎస్ ధర్మారావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పెన్ పవర్
కదుతులలో మూగజీవాల మృత్యువాత
- పట్టించుకోని అధికారులు

## మలేరియా అంతానికి అందరి కృషి అవసరం



- పలు వార్డులలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీలు
- జోన్ 2 మలేరియా అధికారి మంగరాజు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం మార్చ్ 25:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గం జోన్ 2 పరిధి 10.11.12.13 వార్డులలో అవగాహన ర్యాలీలు నాలుగు రోడ్ల కూడలి, ప్రధాన రహదారులు, పలు వీధులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.మలేరియా అంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని%జ% సమిష్టి కృషితోనే మలేరియా అంతం అవుతుందని, జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్. విశాఖ జిల్లా కలెక్టర మరియు కమిషనర్ జీవీఎంసీ ఆదేశాల మేరకు పలు వార్డులలో ఈ కార్యక్రమాల నిర్వహించినట్లు జూన్ 2 మలేరియా ఇన్స్పెక్టర్ మంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారులు విభాగం సిబ్బంది సూపర్వైజర్లు. మలేరియా హెల్త్ అసిస్టెంట్. మలేరియా హెల్త్ విజిటర్స్ తదితరులు పాల్గొన్నారు



# గుడివాడ అమర్నాథ్ ని కలిసిన మండల వై.సి.పి నాయకులు





**పరవాడ (పెన్ పవర్ )ఏప్రిల్ 25:** గాజువాక మండలం మింది గ్రామంలో అనకాపల్లి జిల్లా వై సి పి నూతన అధ్యక్షులు గా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ని వారి స్వగృహం శుక్రవారం పరవాడ మండలం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సి.ఈ.సి సభ్యులు పైల శ్రీనివాసరావు అమర్నాథ్ ని సాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా లో అందరూ కలిసికట్టుగా పని చేసి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ని బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వై.ఎస్.ఆర్.సి.పి కార్యకర్తల పై కక్షపురితంగా వ్యవహరిస్తున్నరని , కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనను గురించి ప్రజల్లోకి తీసుకు వెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని అన్నారు. రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ ని జిల్లా పార్టీ అధ్యక్షులు గా నియమించిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి , రాష్ట్ర వై.ఎస్.ఆర్.సి.పి అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. గుడివాడ అమర్నాథ్ నియామకం తో పార్టీ పూర్వవైభవం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, రాష్ట్ర మాజీ ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ దాలయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు,బందారు శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జనసేన నాయకుడు రామ గోవిందరావు జన్మదిన వేడుకలు.







**పరవాడ(పెన్ పవర్) ఏప్రిల్ 25:** ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు జన్మదిన వేడుకలు శుక్రవారం 1993–94 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ బోనంగి గ్రామంలో ఉన్న పోలమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామ గోవిందరావు జన్మదిన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పళ్ళు , రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పైలా రాము, చిరికి లోకేష్, రెడ్డి గోపి,బండారు శరన్ కుమార్, కలిదిండి రామకృష్ణారాజు, బండారు వెంకు నాయుడు, బండారు సింహాద్రి రావు, సీరం రెడ్డి శ్రీను, బండారు సోమనాయుడు, బైలపూడి సింహాద్రి, మంగాల సూర్యరావు, కటారి సన్యాసిరావు, సబ్బవరపు పైడునాయుడు, అనకాపల్లి నారాయణరావు, రేఖా రామారావు, బుగిడి రామ ప్రభాకర్ రావు, పైల వెంకట జోగినాయుడు, నరవ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ దుర్జో



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం సీలేరు పంచాయతీ కేంద్రంలో గ్రామ పంచాయితీ సారాధ్యంలో స్థానిక సర్పంచ్ పి దుర్జో చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్జో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పరశురాం, జూనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్, డిసిసి కార్యదర్శి కారే శ్రీను, మరిబాబు, వార్డు సభ్యులు పాపారావు రాము తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల దాడిలో పలువురు గాయాలు..





**కురుపాం ,పెన్ పవర్, ఏప్రిల్-25,**తేనె టీగల దాడిలో పలువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన కురుపాం లో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం శివన్నపేట గ్రామంలో వివాహ కార్యక్రమం సందర్భంగా డీజే పాటలతో ఊరేగింపు జరుగుతుండగా కురుపాం నుండి శివన్నపేటకు వెళ్లే దారి వద్ద ఉన్నటువంటి చెట్టు లో తేనె పట్టు కదిలి సుమారు 50 మంది పై తేనెటీగల దాడి చేశాయని గాయాలు పాలైన వారు వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందుతున్నారని ఒకరి పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ ఇదే చెట్టు వద్ద నుండి పలుమార్లు తేనెటీగల దాడి కి గురై జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రాణాపాయ స్థితి నుండి బయటపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్టు వద్ద నుండి తేనెటీగలను తొలగించే ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నమన్నారు.

## కొండల మధ్య ఉన్న పీ వీ టీ జీ గ్రామం





- సరిగా నీరు అందని గ్రావిటీ వద్ద నీరు సేకరిస్తున్న పీవీటీజీ తున్సీబు గ్రామస్తులు.

**అనంతగిరి పెన్ పవర్, ఏప్రిల్ 25.** తున్సీబు గ్రామంలో దాహం కేకలు పట్టించుకోని గ్రామీణ నీటి పథకం అధికారులు అందుకు సంబంధించిన వివరాలు. అనంతగిరి మండలం మారుమూల పెదకోట పంచాయతీ పరిధి మారుమూల పీ వీ టీ జీ గ్రామమైన తున్సీబు గ్రామంలో దాహం కేకలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. తున్సీబు గ్రామంలో తాగునీటి కొరకు గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురౌవుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. పూర్వకాలపు గ్రావిటీ నుంచి చిన్న పైపు ద్వారా వస్తున్న నీటిని సేకరిస్తున్నామని గ్రావిటీ కూడా పాడై నీరు అందటం లేదని మారుమూల గ్రామం కావడంతో తాగునీటి కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎండ ముదిరిపోవడంతో తాగునీరు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రావిటీ పాతది కావడంతో నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని, మారుమూల గ్రామం కావడంతో మా గ్రామాలకు ఏ అధికారులు ఏ నాయకులు పర్యటించలేని పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు డిప్పల సొనాలి , సిద్ధు, సతీష్ తదితరులు తెలుపు తున్నారు.గ్రామీణ నీటి పథకం అధికారులు కార్యాలయంలో కాలం వెల్ల బుచ్చు తున్నారని, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సేవించేందుకు ఒక్క బిందె నీళ్లు కూడా దొరకడం గగనంగా ఉందని, గ్రామాల్లో పర్యటిస్తే తాగునీటి సౌకర్యం ఉందో లేదో వారి దృష్టికి తీసుకెళ్లగలమని ఎవరూ కూడా తుంసేపు గ్రామం పర్యటించకపోవడంతో గ్రామస్తులు నీటి కొరకు అనేక కష్టాలు పడుతున్నట్లు వారు వెల్లడించారు కొంతమంది గ్రామంలో యువకులు కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు పత్రాలు అందించిన తాగునీటి కొరత తీర్చలేని గ్రామీణ నీటి పథకం అధికారులంటు గ్రామస్తులు తెలుపు తున్నారు. నాయకులు అధికారులు స్పందించి తున్సీబు గ్రామంకి తక్షణమే తాగునీటి కొరకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలుపుతున్నారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ,సదస్సు.




- మలేరియా అంతం మనతోనే సాధ్యం
- డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు..

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, ఏప్రిల్25:** అవగాహనతో మలేరియా నివారించవచ్చుని,ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ని శుక్రవారం ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి ఆయన జెండా ఊపి ప్రారంభించారు.మలేరియా నివారణ నినాదాలతో ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఎన్జీఓ హోం సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ మలేరియా వ్యాధి మరియు నివారణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తద్వారా నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.మన పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల లార్వా పెరుగుతుందని,నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే-డ్రైడే ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరారు.జిల్లాలో మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని,దోమల నివారణ చర్యల్లో భాగంగా 915 గ్రామాల్లో వచ్చేనెల ఒకటవ తేదీ నుండి ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ ఇంటింటికి చేయించడం జరుగుతుందని,అలాగే జూలై 1 నుండి రెండవ విడత పిచికారీ చేయిస్తామని తెలిపారు. ఏఎల్ఓ పిచికారీ,ఫోకల్ స్ప్రేయింగ్,ఫాగింగ్ లను మలేరియా గుర్తించిన ప్రాంతాల్లో చేయించడం జరుగుతుందన్నారు.వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ ద్వారా దోమల పెరుగుదల ప్రదేశాలను వైద్య సిబ్బంది గుర్తించి వివరాలు నమోదు చేసి పంచాయతీ,వార్డ్ సెక్రటరీలు,సిబ్బంది ద్వారా ఎప్పటికపుడు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని అన్ని ఆరోగ్య కేంద్రాలు పరిధిలో నిర్వహించడం జరిగిందని, వివిధ శాఖల సమన్వయంతో ప్రజల్లో అవగాహన పెంపొందించి జిల్లాలో మలేరియా నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్ మోహనరావు, పిఎల్. రఘుకుమార్,ఏఎంఓ డి. సూర్యనారాయణ,వైద్యాధికారి డా.రవిచంద్ర,క్వాలిటీ కన్సల్టెంట్స్ డా.రమణ,డా. మణికంఠ,ఎన్జీఓ అధ్యక్షులు జివిఆర్ఎస్. కిషోర్, డెమో సన్యాసిరావు,సబ్ యూనిట్ అధికారి ధనుంజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, పంపిణీ కార్యక్రమం.







**గుమ్మలక్ష్మీపురం. ఏప్రిల్ 25 పెన్ పవర్.**పార్వతీపురం మన్యం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ.అధ్యక్షులు డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు. ఆధ్వర్యంలో ప్రతినెల ఒక సామాజిక కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం నాడు కురుపాం నియోజకవర్గం, మండల కేంద్రంలో. ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో 40 మంది నిరుపేదలకు దుప్పట్లు. వేసవికాలం అయినందున 40 దోమతెరలు ఇవ్వడం జరిగింది. అలాగే వచ్చే కార్యక్రమంలో ఈ నిరుపేదలకు వంట పాత్రలు భోజనానికి కంచాలు, గ్లాసులు కూడా ఇస్తామని.రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు రెడ్ క్రాస్ చైర్మన్ చిరు కానుక అందించారు. మన్యం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీరాములుకు ఎమ్మెల్యే చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎం.సీ చైర్పర్సన్ కడ్రక కళావతి, నియోజకవర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి , రెడ్ క్రాస్ సొసైటీ.నుండి ఏ.పీ.ఆర్జేసీ ప్రిన్సిపాల్. యుగంధర్, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు. జగన్నాథరాథో, గుడ్ల హరిప్రసాద్, పైడా కొండలరావు, దొరబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర శస్త్ర చికిత్సలు కోసం తరలింపు...



**కురుపాం, పెన్ పవర్, ఏప్రిల్-25:**జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ వారి ఆదేశాలమేరకు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక కంటి వెలుగు కార్య క్రమం లో బాగంగా గుమ్మలక్ష్మీపురం,కురుపాం మండలంలో వున్న సచివాలయంల పరిధిలో వున్న గ్రామాలలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిభిరం లలో చేసిన నేత్ర పరీక్షలలో కేటరాక్ట్(అంతర కుసుమం) టెరిజియం(కొయ్యకండ) వున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం ఈ రోజు కురుపాం సామజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్ప గిరి కంటి ఆసుపత్రి విజయ నగరం కి తరలించి రేపు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా జీరు నగేష్ రెడ్డి తెలిపారు.వీరందరికీ ఉచిత రవాణా,వసతి, భోజనం, కళ్ళ జోల్లు,మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు కు వెళుతున్న రోగులకు పలు సూచనలు,జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మా లాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యత జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ గారు తీసుకొని అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్ ఐ సి టి సి కౌన్సిలర్ మోహన్, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మరియు ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

## సంకడ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామ సమస్యలపై సబ్ కలెక్టర్కు వినతి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జనసేన పార్టీ నాయకులు ఊలం ఈశ్వరరావు మరియు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. కుమ్మరపల్లి గ్రామానికి జిపిఎస్ సర్వే చేపట్టాలని, సర్వే నిర్వహించకపోవడంతో ఆన్లైన్లో గ్రామం పేరు కనిపించడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని, వర్షం కురిచినప్పుడు తరగతి గదుల్లోకి నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై సబ్ కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వగా సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాంగి చిరంజీవి, వంతల బాలకృష్ణ, గుంట రామారావు, పాంగి బాలయ్య, వంతల బాలయ్య,పి.రామకృష్ణ, పాంగి సుబ్బారావు,పి. సుబ్బారావు, గిరిబాబు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులులో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి





- దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి వెలుగు నింపిన చేయూత
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి.
- దివ్యాంగులకు రూ. 49.01 లక్షల విలువైన ఉపకరణాల పంపిణీ

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, ఏప్రిల్ 25 :** దివ్యాంగులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈ సంక్షేమ పథకాలు అమలు చేస్తు న్నామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. దివ్యాంగుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని అన్నా రు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంకు సామజిక భాధ్యత కార్యక్రమం లో భాగంగా అలింకో సంస్థ తయారుచేసిన రూ. 49.01 లక్షల విలువైన 380 అత్యాధునిక ఉపకరణాలను శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరం వేదికగా 241 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి,ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. విశాఖ జిల్లాలో దివ్యాంగుల శారీరక, మానసిక దృఢత్వం కోసం రూ. 200 కోట్లతో 25 ఎకరాల్లో అత్యాధునిక పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాని కి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రీజినల్ సెంటర్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సహకారంతో స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. గత డిసెంబర్‌లో రెడ్డిపల్లి, నీలమ్మ వేపచెట్టు ప్రాంతం, క్వీన్ మేరీ హైస్కూల్ పరిధిలో నిర్వహించిన మూడు ప్రత్యేక శిబిరాల్లో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన సహాయక ఉపకరణాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఐడీబీఐ బ్యాంక్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత (%జూ=%) నిధుల ద్వారా హైదరాబాద్‌లోని %ూూ×వీజూ% సంస్థ అందించిన అత్యుత్తమ నాణ్యత కలిగిన ఉపకరణాలను ఈరోజు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వివిధ రకాల దివ్యాంగులకు ఈరోజు పంపిణీ చేసిన వాటిలో ముఖ్యంగా బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు హియరింగ్ ఎయిడ్స్, సాధారణ ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కమోడ్‌తో కూడిన %జూ% వీల్ చైర్‌లు, పి ఎల్ ఎం కిట్‌లు, ఫోల్డింగ్ వీల్ చైర్‌లు, కృత్రిమ అవయవాలు ప్రొస్థెసిస్, జాయ్‌స్టిక్ వీల్ చైర్‌లు, కర్రలు క్రచెస్, కాలిపర్స్, రోలేటర్ మరియు సుగమ్య చెరకు వంటి 380 రకాల ఉపకరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, "ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. ప్రతి ఒక్క లబ్ధిదారుని అవసరా న్ని గుర్తించి, వారికి అవసరమైన ఉపకరణాన్ని అందించడం ప్రభుత్వ నిజమైన సంకల్పానికి నిదర్శనం," అని కొనియాడారు. జ్యోతి ప్రజ్వల నతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మరియు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దివ్యాంగు లకు ఉపకరణాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణు కుమార్ రాజు, ఐడీబీఐ బ్యాంక్ జనరల్ మేనేజర్ కన్వాడెబ్ దాస్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏ.డి. మాధవి, పెద్ద సంఖ్యలో హాజరైన దివ్యాంగులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ





**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 25** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ బోండా. జగన్నాథం , టి. శివయ్య మెడికల్ ఆఫీసర్ కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు యాంటీ మలేరియా యూనిట్ గాజువాక సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినం పురస్కరించుకొని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన మలేరియా అంతం మనతోనే అనే నినాదం ,మరలా వనరులు సమకూర్చు,మరలా ఊహించు,మరలా ఉత్తేజపరిచే ఉప నినాదము ల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కణితి నుండి ఈ సేవ కూడలి కణితి వరకు ర్యాలీ నిర్వహించటం జరిగింది . మలేరియా నివారించటం మన అందరి చేతుల్లో ఉందని ,ప్రతి ఒక్కరూ మలేరియా నివారణ ,కార్యక్రమములో భాగస్వాములు కావాలని , ప్రతిజ్ఞ చేయడం జరిగింది,

ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు రాజన్ రాజ్, సీనియర్ నాయకులు వర్రే రాంబాబు,ప్రగడ దానయ్య, పోతల కృష్ణ,సుందర్ సునీల్,సహాయమలేరియా అధికార్లు, ,మలేరియా సుపరెండేట్ అధికారి , సూపర్వైజర్లు, ప్రభుత్వ ఆరోగ్య శాఖ సిబ్బంది , బి . యస్. సి విద్యార్థులు, ఆరోగ్య పర్యవేక్షకులు ఏ . యన్ . మ్ లు, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేర్ టేకర్లు కావలెను:పూసర్ల భాగ్య




గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 25: పెద్ద మనుషులను మరియు చిన్నపిల్లలను చూసుకోవటానికి కేర్ టేకర్లు కావాలని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ మాడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు పూసర్ల భాగ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత భోజన వసతి తో పాటు మంచి జీతం ఇవ్వబడుతుందని, ఉద్యోగ స్థలం హైదరాబాద్ అని ఆసక్తి గలవారు 8919753247,8500974223 నంబర్లకు సంప్రదించాలని ఏమైనా సందేహాలు ఉంటే ఈ ఫోన్ నెంబర్లకు మరియు %ఎష్ట్రుస్త్రుఝజూబయిుతీశ్రీుఏస్త్రుఝఅశ్రీ.ఎశీఎ%ను సంప్రదించవచ్చునని ఆమె పేర్కొన్నారు.

# గంజాయి వద్దువ్యవసాయమే ముద్దు

- వివిధ శాఖల అధికారులతో ర్యాలీ
- మండల వ్యవసాయ అధికారి బి .శ్రీనివాసరావు.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 25:**-చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలసి ర్యాలీనిర్వహించారు,గంజాయి వద్దు.. వ్యవసాయమే ముద్దు. గంజాయిని పండించడం గాని, సేవించడం గాని మంచిది కాదని,గిరి రైతులందరూ వ్యవసాయంపై మక్కువ చూపాలని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలసి మండలకేంద్రం లో ర్యాలీ నీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి పంట పండించడం రవాణా చేయించడం సేవించడం చట్టరీత్యా నేరం అని ఇది కేవలం భవిష్యత్తుని కాదు కుటుంబ సభ్యుల భవిష్యత్తునుకూడాప్రమాదంలోకి నడుస్తుందన్నారు. గంజాయిపంటకుప్రత్యామ్నాయ పంటగా స్థిరమైన ఆదాయంతో మంచి పంటలను పండించి భవిష్యత్తును సంతోషం దాయకం. డ్రగ్స్ తో జీవితం నాశనం చేసుకోవద్దని, గంజా వంటి మత్తు పదార్థాలు తీసుకున్న వారికి మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థకు రోడ్డున పడేస్తాయి అన్నారు . గంజాయి పంటను మానివేసి ఆనందకరమైన జీవితాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు చంద్రశేఖర్, వివిదశాఖల అధికార్లు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం





- బ్లాస్టింగ్ ల వలన పాడైన సుమారు100 ఇల్లు పరిశీలన

**పాయకరావుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 26.** పాయకరావుపేట దుర్గా కాలనీ వద్ద పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాంట్రాక్టర్లు కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని పెద్ద పెద్ద బాంబులతో బ్లాస్టింగ్లు చేయడం వలన సుమారు అక్కడ ఉన్నటువంటి నిరుపేద కుటుంబాల ఇల్లు అదురుతూ క్రాకలిస్తున్నాయని ప్రజాప్రతినిధులకు, మండల తాసిల్దార్ కు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేసిన విషయం విధితమే. ఈ మేరకు పట్టు వదలని విక్రమార్కుడిలా ఎంపిటిసి కసింకోట సత్తిబాబు, వార్డ్ మెంబర్ పల్లా ప్రసాద్, నాయకులు గంపల రాజు టిడిపి మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబుకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గెడ్డం బుజ్జికి తెలియజేయగా కాల్వ పనులు వేగవంతం గా జరగట్లేదని పరిశీలనకు వచ్చిన అధికారులకు అక్కడ ఉన్నటువంటి విషయం కళ్ళకు కట్టినట్టుగా ఎన్ని ఇల్లు పాడైపోయాయో వివరించారు. దానిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో దుర్గ కాలనీ లోపల రాజీవ్ నగర్ కాలనీలో గల సుమారు 100 ఇళ్లను పరిశీలించామని దానిని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందిస్తామని రెవిన్యూ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు సివిల్ ఇంజనీర్ అసిస్టెంట్ ఇంజనీర్, వీఆర్వోలు వెంకటేశు రాజు, నాయకులు బంగారం అప్పారావు తదితరులు పాల్గొన్నారు





# పహాల్గాం ఉగ్రవాద దాడిని ఖండిస్తూ కూటమి నాయకులు నిరసన ర్యాలీ...



**కురుపాం,పెన్ పవర్, ఏప్రిల్-25,**జమ్మూకాశ్మీర్ పహాల్గాం పర్యాటకులు పై ఉగ్రవాదులు దాడిని ఖండిస్తూ కురుపాం మెయిన్ రోడ్డు లో కూటమి నాయకులు నిరసన ర్యాలీ శుక్రవారం సాయంత్రం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పహాల్గాం లో తీవ్ర వాదులు దాడి పిరికి పంద చర్యలు గా పేర్కొన్నారు. సత్తా ఉంటే భారత ఆర్మీని ,ప్రభుత్వం ను ఎదుర్కోవాలని అన్నారు..అనంతరం మృత్యువాత పడిన 26 మంది కి మౌన ప్రదర్శన చేపట్టారు. మండల కన్వీనర్ కెవికొండయ్య ,జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు , తెలుగు దేశం పార్టి నాయకులు జివి రమణమూర్తి ,ఆకుల రమేష్ ,బలగ రామకృష్ణ కర్రి శ్రీనివాస్ ,వివిధ మండలాల జనసేన ,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# 100 గజాలలోపు కట్టడాలకు అధికారులు స్వేచాయత వాతావరణం పేదలు నిర్మించుకునే ఇండ్లకు కఠినమైన నిర్ణయాలు తీసుకోరాదు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 25.** :విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివా స్ పలు అంశాలను ప్రస్తావించారు సిఆర్జెడ్ పరిధిలో ఉన్న నిబంధనలను సరళీకరించి కట్ట డాల నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వాలని కోరారు 100 గజాలలో ఇంటి నిర్మాణానికి షరతులు లేకుండా ఇంటి నిర్మాణానికి వెసులుబాటు కల్పించాలని , పేదలు నిర్మించుకునే ఇండ్లకు కఠినమైన నిర్ణయాలు తీసుకోరాదని తెలియ జేశారు. అదే విధంగా 100 గజాల లోపు కట్టడాలకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా స్వేచాయత వాతావరణం కల్పించాలని కోరారు,సచివాలయాల పరిధి తగ్గించి, ప్రజలందరికీ పారదర్శకంగా పాలన జరిగేటట్లు చూడాలని కోరారు,దక్షిణ నియోజక వర్గం లో పాత నగరం చాలా చిన్నచిన్న రహదా రులతో కూడుకొని ఉన్నదనీ , ఎన్నో సంవత్స రాలుగా వ్యాపారాలు చేసుకునే వారికి ఎటు వంటి ఇబ్బందులు కలగ చేయకూడదని, ఏమై నా నిర్ణయాలు తీసుకున్నప్పుడు ప్రజా సహ కారం లేకుండా తీసుకోకూడదని తెలిపారు

ఇప్పటివరకు నిర్మించుకున్న కట్టడాల గాని, షాపులు గాని వ్యాపారులను గాని, ఎటువంటి ఇబ్బందులకు గురి చేసిన సహించేది లేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మంత్రి బాలాంజ నేయస్వామి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రభు త్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నా రు,




# పహాల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన చంద్రమౌళికి పల్లా ఘన నివాళి





**గాజువాక :పెన్ పవర్ 25** జమ్మూ కశ్మీర్లోని పహల్గాం ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లిన విశ్రాంత బ్యాంకు అధికారి చంద్రమౌళి ఉగ్రవాదుల దాడిలో అమాయకంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, వారి పార్థివ దేహానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నివాళులు అర్పించారు.

జమ్మూ కశ్మీర్లోని పహల్గాములో జరిగిన ఉగ్రవాద దాడిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజల్లో భయాన్ని రేకెత్తించేందుకు ఉగ్రవాదులు అమాయకులపై దాడులు చేయడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఉగ్రదాడి కాదని మానవత్వాన్ని మరిచిపోయిన ఒక క్రూర చర్య. శాంతియుతంగా విహారయాత్రకు వెళ్లిన పౌరులపై జరగడం మరింత బాధాకరం. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సానుభూతి తెలిపారు . గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షను పల్లా వ్యక్త పరిచారు .

# చోడవరంలో నేడు జాబ్ మేళా

**చోడవరం పెన్ పవర్ ఏప్రిల్ 25 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా చోడవరం ప్రభుత్వ హైస్కూల్లో శనివారం 23 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు శుక్రవారం తెలియజేసారు. ఈ ఇంటర్వ్యూలలో పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ , పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చున్నారు.. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను నైపుణ్యం.ఏపీ. జీవో వి.ఇన్ వెబ్ సైట్ లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెజ్యూములు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరన్నారు. మరిన్ని వివరములకు 9494791935, 7981102224 నంబర్లను సంప్రదించాలన్నారు.

## నేరెళ్ల బంధ గ్రామంలో వైద్య శిబిరం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లకవరపుపేట పంచాయితీ నేరేళ్ల బంధ గ్రామంలో ఏపీడమిక్ ముందస్తు చర్యల్లో భాగంగా పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ పృద్విష ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుమారు 30 మందికి వివిధ రకాల వ్యాధులకు చికిత్స నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పృద్విషా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని పెట్టాలని, వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు కలుషితం అవుతుంది కాబట్టి తప్పనిసరిగా ప్రజలు నీరు కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. ఏమైనా అనారోగ్య సమస్యలు సంభవిస్తే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక మొత్తంలో ద్రవపదార్థాలను తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఎం పి హెచ్ ఓ బాలరాజు, హెల్త్ అసిస్టెంట్ అచ్యుత్, ఏఎన్ఎం సత్యవతి, వెంకీ కుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ జాతరలో శ్రీరామ భజన బృంద గానం.

● జన హృదయాల్లో అలరించిన బృందగానం



**చింతపల్లి పెన్ ఏప్రిల్ 25 :**-శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీ రామ భజన బృంద కార్యక్రమం జన హృదయాలను గెలుచుకుంది . సాయంత్రం ఐదు గంటల నుండి 8 గంటల వరకు కొనసాగిన భజన బృంద కార్యక్రమం ఆద్యంతం భక్త హృదయాలను రసవత్తంగా ఆకట్టుకుంది. వివిధ సంకీర్తనలతో ఆలపించిన భజన బృందం భక్త రస హృదయాలను ఆకట్టుకుంది. మండలంలోని చౌడుపల్లి గ్రామానికి చెందిన ఈ భజన బృంద కార్యక్రమంలో దేపూరు వెంగళయ్య, సీనియర్ మన్యం గాయకుడు ఎన్ వి ఆర్ ఆర్కెస్ట్రా అధినేత మద్దిల నారాయణరావు, లువాబు బాలరాజు ఉడుముల కోటి లండ శంకర్ నూకరాజు విజయకుమార్ అశోక్ సింహాచలం సోమేశ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## మలేరియా మనతోనే అంతం గాజువాక పి . హ్ చ్. సి




**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 25** ప్రాధిమిక ఆరోగ్య కేంద్రం గాజువాక వైద్యాధికారి డా . యం . సుధాకర్ ,బదరి నారాయణ మూర్తి ఆద్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం అవగహన రాలీ నిర్వహించారు . మలేరియా మనతోనే అంతం అను నినాధం తో డా . బదిరి రాలీ ప్రారంభించారు . అవగహన కార్య క్రమంలో పి . హ్ చ్. సి సి హ్ చ్ ఓ నాగ అప్పారావ్ మాట్లాడుతూ పరిసరాలలో దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని , మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి అని , దోమలు కుట్టకుండా పలు జాగ్రత్తలు చెప్పట్టాలని , సచివాలయం పరిధి లో గృహలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఫ్రైడే డ్రై కార్యక్రమం విధిగా పాటించే విదంగా చర్యలు తెసుకోవాలి అని అన్నారు .

### ఉగ్రదాడిని నిరసిస్తూ మొబైల్ షాపుల యజమానుల ర్యాలీ




**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రైల్ 25) :**పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ నర్సీపట్నంలో మొబైల్ షాప్ ల యూనియన్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అబీద్ సెంటర్ నుండి దుర్గా గుడి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దారి పొడుగునా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దుర్గగుడి జంక్షన్లో మానవహారంగా ఏర్పడ్డారు. కొద్దిసేపు ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతించాలని కోరుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు పంజా విసరడం అమానుషమన్నారు. కేవలం హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడాన్ని ఖండించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారిలో మన తెలుగువారు ఉండడం దురదృష్టకరమని, వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జె.మోహన్ పట్టణంలో మొబైల్ షాపుల యజమానులు అందరూ పాల్గొన్నారు.

# బుకీలను సాంకేతిక ఆధారాలతో అరెస్ట్





● పోలీస్ కమిషనర్ డాక్టర్. శంఖబ్రత బాగ్చి

**క్రైమ్ బ్యూరో ,పెన్ పవర్, విశాఖపట్నం, ఏప్రిల్ 25:**క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు బుకీలను సాంకేతిక ఆధారాలతో పట్టుకొని అరెస్ట్ చేసిన విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్
ఆన్ లైన్ మరియు ఆఫ్ లైన్ ద్వార అమాయ కులను తప్పు త్రోవ వైపుకు మల్లిస్తు బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా భగ్నం చేసే కార్యక్రమం లో బాగంగా మరియు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్. శంఖబ్రత బాగ్చి, ఐ.పీ.ఎస్.. కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో, రాబ డిన సమాచారం మేరకు, మాయ మాటలు చెప్పి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, డబ్బుల ఆశ చూపించి, వాళ్ళ దగ్గర ఉన్న డబ్బు అంత ఖాళీ చేసే బెట్టింగ్ వెబ్ సైట్ లలో డబ్బు పెట్టేలాగా అలవా టు చేస్తూ జీవితాలను నాశనం చేస్తున్న వారిని అదుపు చేసి ప్రక్రియ లో భాగం గా సిటీ టాస్క్ ఫోర్స్ మరియు సైబర్ క్రైమ్ పోలీస్ వారు సమిష్టిగా విశాలాక్షి నగర్ వద్ద, జోడుగుల్ల పాలెం ప్రాంతం లో ఆఫ్ లైన్ మరియు ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న విశాఖపట్నం ఆదర్శ నగర్, పెద వాల్తేర్ కు చెందిన ఒక వ్యక్తిని పత్యేక మైన నిఘా విభాగమును పెట్టి, సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా వ్యవహ రించి ఆన్ లైన్ లో బెట్టింగ్ వెబ్ సైట్ లలో గేమ్ ఆడుతున్న ఆసామిని పట్టుకొని ఏప్రిల్ 20 అరెస్టు చేసి రేమాండ్ కు తరలించడం జరిగింది.
సదరు విచారణ లో పై ముద్దాయి మరో నలు గురు వ్యక్తులతో ఒక సమూహముగా ఏర్పడి కలిసి మధురవాడ ప్రాతం నందు ఒక అపార్ట్మెం ట్ లో ప్లాట్ ని అద్దె కు తీసుకొని ఆఫ్ లైన్ మరియు ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తునట్లు తెలిసింది.తదుపరి ఈ కేసు దర్యాప్తులో భాగం గా మరో ముగ్గురు బుకీల ముద్దాయిలను ఏప్రిల్ 23 అరెస్టు చేసే రిమాండ్కు తరలించడం జరిగింది. అ ముగ్గురు బుకీల మధురవాడ, శివజిపాలెం, చిన్నగదిలి ప్రాంతానికి చెందినవారు మరియు వారిలో ఒకరు ఆంధ్రా యూనివ ర్శిటీలో గ్రేడ్-2 డ్రైవర్గా పనిచేస్తున్నాడు మిగతా వాళ్ళు ప్రైవేటు గా పనిచేస్తునారు. ఈ కేసు లో నేరానికి ఊపయోగించిన ఒక లాప్ టాప్, నలు గు స్మార్ట్ మొబైల్ ఫోన్స్, రెండు బేసిక్ మొబైల్ ఫోన్స్ ను దరియప్తులో భాగం గా సీజ్ చెయ్య దం అయినది. ఇంకా ఈ కేసులో ప్రధాన ముద్దాయి మరియు బెట్టింగ్ ఆడుతున్నటు వంటి జూదగాల్లను అరెస్ట్ చేయవలసి ఉన్నది.
ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ బెట్టింగ్లలో మీకు తక్కువ డబ్బుల పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలకు ఆశ చూపించి లక్షల రూపాయలు కొల్లగొట్టడం జరుగుతుంది. అందువలన ప్రజలెవరు కూడా బెట్టింగ్ గేమ్స్ జోలికి వెళ్ళకుండా ఉండాలని మనవి మరియు ఎవరైనా ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ బెట్టింగ్ నిర్వ హించిన, నిర్వహిస్తున్న వారికి సహకరించిన, లేదా మీరు బెట్టింగ్ లో పాల్గున్న మీ పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలి యజేస్తున్నాము. సైబర్ క్రైమ్ పిర్యాదుల కొరకు సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ టోల్ ఫ్రీ నెంబర్: 1930 లేదా కమిషనర్ ఆఫ్ పోలీస్: 7995095 799 వారికి కాల్ చేసి ఫిర్యాదు చేయగలరని తెలిపార్ఙు

## కిసాన్ డ్రోన్లపై రైతులు, పైలెట్లు అవగాహన పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



**కురుపాం /పార్వతీపురం,పెన్ పవర్, ఏప్రిల్ 25 :** కిసాన్ డ్రోన్లతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, కావున వాటిపై రైతులు, పైలెట్లు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కిసాన్ డ్రోన్ల అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొని వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించే పద్ధతిని రైతులు, పైలెట్లతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఆరు కిసాన్ డ్రోన్లు మంజూరయ్యాయని, రైతులు గ్రూపుగా ఏర్పడి వీటిని కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఒక్కో యూనిట్ ధర రూ. 10 లక్షలు కాగా రూ. 8లక్షలు వరకు సబ్సిడీ ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఋణంగా పొందవచ్చని అన్నారు. రైతుల సౌలభ్యం కొరకు డ్రోన్లు సరఫరా చేసే రెండు కంపెనీలు, బ్యాంకర్లు కూడా ఈ సదస్సులో పాల్గొనడం జరిగిందని తెలిపారు. కావున రైతులు, వీటిని వినియోగించే పైలెట్లు కిసాన్ డ్రోన్ల పట్ల పూర్తి అవగాహన చేసుకోవాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, రైతులు, కంపెనీ ప్రతినిధులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మన్యంలో జీడి పిక్కలు కోనుగోలు దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్లుగా ఉంది.

● కురుపాం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపాటు..



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 25. పెన్ పవర్.**పార్వతిపురం మన్యంలో గిరిజనులు విస్తారంగా సాగు చేస్తున్న జీడి మామిడి పంట కోతకు (ఏరివేతకు) విచ్చేసి రెండు నెలలు గడిచిపోతున్న ఈ ఏడాది అరకొరా పంటతో జీడి రైతులు దిగులు చెందుతూనే, చేతికి అందోచ్చిన జీడి పిక్కలు ఈపాటికి 'ప్రైవేట్ వ్యాపారస్తులకు' అమ్మి వేశారు. దీంతో గిట్టుబాటు ధర పొందడంలోనూ, తూనికల్లో సైతం అక్రమార్జన చేసే ప్రైవేట్ వ్యాపారస్తుల వలలో చిక్కి గిరిజన రైతులు ఎంతగానో నష్టపోయారని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో - ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు వాపోయారు. శుక్రవారం ఆయన గుమ్మ లక్ష్మి పురం లో విలేకరులతో మాట్లాడుతూ...

ప్రభుత్వం వెలుగు పథకంలో నడిపింపబడుతున్న 'వన్ ధన్ వికాస కేంద్రం'(వి.డి.వి.కె) ల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేపట్టడం విడ్డూరంగా ఉందని, 'దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్లుగా'.. ప్రభుత్వము, ప్రభుత్వ అధికారుల తీరు వింత గొల్పేలా ఉందని ఆయన దుయ్యబట్టారు.

ప్రతి ఏటా మన్యంలో ప్రభుత్వమే జీడిపిక్కలు కొనుగోలు చేపట్టాలని గిరిజనులు, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జీడిపిక్కల సీజన్ మార్చి నెల మొదటి వారం నుంచే కొనుగోలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా ఇప్పుడు (ఏప్రిల్ చివర్లో) కొనుగోలుకు ఉపక్రమించడం గిరిజన రైతులపై ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు చూపే 'సవతి తల్లి' ప్రేమకు పరాకాష్ట అనక తప్పదని చిన్నారావు పేర్కొన్నారు.

## పర్యాటకుల పై కాల్పులు అమానుష చర్య



● చంద్రమౌళికి కన్నీటి వీడ్కోలు గంటా

**భీమిలి, పెన్ పవర్, ఏప్రిల్ 25 :**పర్యాటకులపై కాల్పులు జరపడం అమానుష చర్యని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కశ్మీర్ లో ఉగ్రవాదుల కాల్పుల్లో అసువులు బాసిన జె.ఎన్. చంద్రమౌళి భౌతిక కాయానికి పాండురంగపురంలోని నివాసం వద్ద శుక్రవారం శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశా రు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కుటుంబంతో సరదాగా గడప డానికి కశ్మీర్ వెల్లిన చంద్రమౌళిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన వారు ఎక్కడ దాక్కున్నా మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న రోజును బ్లాక్ డే గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చలించి పోయారని, విశాఖ వచ్చి విమానాశ్ర యంలో చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులు అర్పిం చాన్నారు. చంద్రమౌళి కుటుంబానికి అండగా ఉండాలని తమను పంపారని పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం గల చంద్రమౌళి మరణం బాధా కరమని, ఆయన తోడల్లుడు కుమార్ రాజా, బావమరిది డీఎస్పీ నాగేశ్వరరావు తనకు మం చి మిత్రులన్నారు. స్నేహితులు, బంధు మిత్రుల తో పాటు గంటా శ్రీనివాసరావు - చంద్రమౌళికి కన్నీటి వీడ్కోలు పలికారు.



## ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ జనసేన నాయకులు మానవహారం.....




**నాతవరం,పెన్ పవర్(ఏప్రిల్ 25):** జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగద్రాడిని నిరశిస్తూ జనసేన అధ్యక్షులు,ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు మానవహారం నిర్వహించారు. అనంతరం ఉగ్రవాదుల దాడి నశించాలంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి క్రూరమైన చర్య అన్నారు.దాడిలో 28 మంది పర్యాటకులు మృతి చెందటం బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి, భవిష్యత్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ, గవిరెడ్డి నాయుడు తదితరులు పాల్గన్నారు.

# టిడ్కో అవకతవకలపై కమిటీతో విచారణ





- ఆర్థిక రాజధాని ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దాలి
- మాస్టర్ ప్లాన్ రోడ్లు, ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించాలి.
- టిడ్కో ఇళ్ల మంజూరు, రిజిస్ట్రేషన్ ప్రక్రియల్లో అవకతవకలపై విచారణ జరిపించాలి
- సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తపడాలి
- విశాఖపట్టణం జిల్లా సమీక్ష మండల సమావేశం లో ఇన్చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి
- భాగస్వామ్యమైన ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్, జేసీ, వీఎంఆర్డీఏ కమిషనర్, ఇతర అధికారులు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, ఏప్రిల్ 25** :దేశంలో ప్రముఖమైన నగరాల్లో ఒక్కటైన విశాఖపట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని, ఆర్థిక రాజధాని ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని, సరైన కార్యాచర ణతో ముందుకెళ్లాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆర్థికంగా రోజురోజుకూ ఎదుగుతున్న విశాఖ నగర గౌరవాన్ని, ప్రతిష్ఠతను కాపాడుకునేలా సమష్టి కృషి చేయాలని సూచించారు. విశాఖపట్టణం జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శు క్రవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి సమావేశంలో ఆయన వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లాలోని చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి, జిల్లా స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్ రోడ్లపై, ఇతర ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో భాగంగా జిల్లా ఇన్చార్జి మంత్రి వివిధ అంశాలపై మాట్లాడారు. దేశంలోనే అత్యధికంగా ఆదాయ వనరులు కలిగిన నగరం విశాఖపట్టణం అని.. అభివృద్ధికి ఇక్కడ అన్ని రకాల అవకాశాలు ఉన్నాయని, దానికి అనుగుణంగా ముందుకు సాగుదామన్నారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుదామ ని, ప్రజలకు మంచి సేవలందిద్దామని మంత్రి పేర్కొన్నారు. పేదలందరికీ ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఆక్రమణల క్రమబద్ధీకరణ నిమిత్తం జీవో నెం.30ని తీసుకొచ్చిందని, దీని ఆవశ్యకతను, ప్రయోజనాలను ప్రజలకు మరింత వివరించాల్సి ఉందని అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అదనపు తాగునీటి ట్యాంకులను అందుబాటులో ఉంచుకోవాల న్నారు. శానిటేషన్ కు ప్రాధాన్యత ఇచ్చి చర్యలు చేపట్టాలని సూచించారు. వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టే మాస్టర్ ప్లాన్ రోడ్లను, ఇతర ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని నిర్దేశిం చారు. మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సదరం స్లాట్ల విషయంలో వెసులు బాటు కల్పించాలని, ప్రజలకు సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో స్లాట్ ఇవ్వాలని సూచించారు. మేఘాద్రి గెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహ ణపై సమీక్షించిన ఆయన ప్రభుత్వ నిర్దేశాల మేరకు తుది చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నగరంలో పలు చోట్ల వీధి దీపాలు సరిగా వెలగటం లేదని ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా వెనువెంటనే ఆడిట్ చేయించి ఎక్కడెక్కడ అవసరమో అక్కడ వీధి దీపాలు యుద్ధప్రాతి పదికన వేయించాలని అధికారులను ఆదేశిం చారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మంజూ రు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పలు అవకతవకలు జరిగాయని, జాబితాలు తారుమారు అయ్యాయని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా దీనిపై ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి సూచించారు. నివాసిర్ధారణ చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాధారణంగా సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు సహకారం అందించాలని సూచించారు. 100 గజాల లోపు స్థలంలో ఇళ్లు కట్టుకునే వారికి సెల్ఫ్ సర్టిఫికేషన్ విషయంలో అడ్డంకులు సృష్టించకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. జీవీఎంసీ ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో చేపట్టబోయే పనులకు సంబంధించి మాస్టర్ ప్లాన్ అనుసరించాలని, దీనికి తగ్గట్టు కార్యాచరణ రూపొందించి ముందుకెళ్లాలని నిర్దేశించారు. వైద్యారోగ్య శాఖ పరిధిలో అందజేసే పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని, అర్హులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలను నివేదించిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,విశాఖ ఎంపీ భరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, కాలయాపన చేయరాదని పేర్కొన్నారు. నగరంలో ఆయా ప్రాంతాల్లోని అవసరాలకు సరిపడా సామర్థ్యం కలిగిన వీధి దీపాలు వేయాలని, దీని కోసం ముందుగా ఆడిట్ చేయాలని సూచించారు. ఇదే అంశంపై తూర్పు, ఉత్తర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా స్పందించారు. విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో గత కొంతకాలంగా వీధి లైట్లు వెలగటం లేదని ప్రస్తావించారు. గాజువాక ప్రాంతంలో జీవో 45 అమల్లో మరింత వెసులుబాటు కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. భూముల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.30లో నిర్దేశించిన గడువును 2019 నుంచి 2024 వరకు పెంచాల్సి ఉందని, అప్పుడే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. పట్టాతో పాటే కన్వేయన్స్ డీడ్ కూడా ఇవ్వాలని కోరారు. అభ్యంతరకర ఆక్రమణల క్రమబద్ధీకరణపై కూడా తుది నిర్ణయం తీసుకోవాలని, దీనిపై ప్రభుత్వానికి నివేదించాలని విజ్ఞప్తి చేశారు. గాజువాకలో విలేజ్ రెవెన్యూ మ్యాప్ ను సవరించాలని, పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన చర్యలు చేపట్టాలని సూచించారు. పెందుర్తి పరిధిలో అన్నా క్యాంటీన్, డిజిటల్ లైబ్రరీ పెట్టాలనుకునే స్థలాలపై ఉన్న కేసుల విషయంలో వేగవంతమైన చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. రాజీవ్ గృహకల్ప నివాసాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారిలో అదనపు కల్వర్టులు, గంగవరం పోర్టులో ఆర్ & ఆర్ కింద ఉద్యోగ నియామకాలు, భూ పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై మాట్లాడారు. పాఠశాలల్లో చేపట్టే నిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ ను అనుసరించాలని అభిప్రాయపడ్డారు. వేపగుంట - పినగాడి రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని, గత 8 నెలలుగా కాలయాపన జరుగుతోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని త్వరలోనే ఎన్.డి.బి. సాయంతో రోడ్డు పనులు చేపడతామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. చినముషిడివాడ సర్వే నెం.163లో ఆక్రమణలు జరిగాయని తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఒక సెంటు స్థలాలు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఇతర అంశాలపై ప్రస్తావన తీసుకొచ్చారు. టిడ్కో ఇళ్ల విషయంలో విచారణ జరిపించాలని, అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ప్రకటించిన లబ్ధిదారుల జాబితా లేదని సంబంధిత అధికారులు చెప్పటంతో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ స్పందించారు. అధికారులు అలా ఎలా చెబుతారు. జాబితా లేకపోవటమేంటి. అర్హులకు రిజిస్ట్రేషన్లు జరగడమేంటి. అలా జరిగితే విచారణ జరిపించండి అని పేర్కొన్నారు. సదరం స్లాట్ల బుకింగ్ లో ఇబ్బందులను తొలగించాలని, ప్రజలకు సమీపంలోని ఆసుపత్రుల్లో స్లాట్ అవకాశం కల్పించాలని గణబాబు సూచించారు. కరాసలో రాత్రిపూట అల్లర మూకల ఇబ్బంది ఉందని, గంజాయి బ్యాచ్ లు ఎక్కువవుతున్నాయని చర్యలు చేపట్టాలని చెప్పారు. కాకాణినగర్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనిపై వీఎంఆర్డీఏ కమిషనర్ స్పందిస్తూ అప్రూవల్ అయ్యిందని, త్వరలోనే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 100 గజాల లోపు స్థలం కలిగిన వారు చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు అధికారులు అడ్డంకులు కలిగిస్తున్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ ప్రస్తావించారు. ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. అవగాహన కల్పించాల్సి ఉంది. అవస్థలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతి ధుల రిఫరెన్సును పరిగణలోకి తీసుకోవాలని, అధికారులు త్వరితగతిన స్పందించాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు పేర్కొన్నారు. అధికారుల పనితీరులో మరింత మార్పు రావాల్సి ఉందని పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇనిస్టిట్యూషన్ ఫర్ డెవలప్మెంట్ స్టడీస్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలో చర్యలు తీసుకుందని, దానికి కావాల్సిన స్థలాన్ని మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ కాలం పని చేసే ఉపాధ్యాయులకు తప్పకుండా బదిలీలు చేయాలని, మరలా వారిని డిప్యుటేషన్ పై పాత చోట కార్యాలయాల్లో విధులు కేటాయించరా దని సూచించారు. నేరెళ్లవలస - తాళ్లవలస రోడ్డును మార్చాలని దాని వల్ల ప్రయోజనాలు లేవని తూర్పు, దక్షిణ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ యాదవ్ లు అభిప్రాయపడ్డారు. పునఃపరిశీలన చేయాలని కోరారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని రాంజీనగర్ లో పాఠశాలను హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. మాధవధారలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. హైవే నుంచి బీచ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్డును అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. వైజాగ్ నుంచి విజయవాడ విమాన సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఫిల్మ్ నగర్ క్లబ్ కు కేటాయించిన స్థల మంజూరు విషయాన్ని పునః పరిశీలించి చర్యలు చేపట్టా లన్నారు. జీవీఎంసీ పరిధిలో జోన్ల పునర్వ్యవస్థీకరణ పై కలెక్టర్ వివరణ. పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం జీవీఎంసీ పరిధిలోని జోన్లను పునర్వ్యవస్థీకరణ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంత్రికి, జిల్లా ప్రజా ప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం ఉన్న జోన్లను ఆయా నియోజకవర్గాల వారీగా అనుగుణంగా మారుస్తామని చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక జోన్ వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ ఆయిల్ అండ్ సీడ్స్ గ్రోవర్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, కమిషనర్ కె.ఎస్. విశ్వనాథ న్, జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఆర్డీవో సంగీత్ మాధుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పై ఓరియెంటేషన్ ట్రైనింగ్



**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, ఏప్రిల్ 25.** :మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ లవుతున్న "మిషన్ శక్తి" కార్యక్రమం లో భాగం గా, "ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పై ఓరియెంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం జోన్-4 జివిఎంసి కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించబ డింది. ఈ కార్యక్రమం విశాఖపట్నం మరియు విజయనగరం జిల్లాలకు చెందిన మహిళా మరి యు శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వహ స్తు న్న సిడిపిఓలు, సూపర్వైజర్లు మరియు మినిస్టీ రియల్ సిబ్బందికి ఉద్దేశించబడి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ జా యింట్ డైరెక్టర్ చిన్నయిదేవి హాజరై, కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఆమె తన ప్రసంగంలో ప్రధాని మాతృ వందన యోజన యొక్క లక్ష్యా లు, ప్రయోజనాలు, మరియు పథకం అమలు లో భాగస్వాముల పాత్రలను విశదంగా వివరిం చారు. మహిళల ఆరోగ్య పరిరక్షణలో ఈ పథ కం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు.
శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం నుండి రీసెర్చ్ మరియు ట్రైనింగ్ స్పెషలిస్ట్ దినేష్ పాల్గొ ని, పథకానికి సంబంధించిన తాజా మార్గద ర్శకాలు, నమోదు విధానం మరియు మానిట రింగ్ వ్యవస్థలపై సిబ్బందికి అవగాహన కల్పిం చారు. హెల్త్ డిపార్ట్మెంట్ నుండి ప్రాజెక్ట్ కోఆర్డి నేటర్ జి. సన్యాసిరావు మాతృ ఆరోగ్య నిర్వహణలో వైద్యశాఖ పాత్రపై వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ కృష్ణ సాయి మరియు డాక్టర్ సమత కూడా కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ ఓరి యెంటేషన్ కార్యక్రమం ద్వారా భాగస్వాముల కు ప్రాధాన్యమైన పథకం అమలులో రాబోయే సవాళ్లు నివేదన యంత్రాంగం మరియు ప్రజల కు సరైన సమాచారం అందించే మార్గాలు పై స్పష్టత ఇవ్వడం జరిగింది.

## మేమంతా భారతీయులం

- పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన ముస్లిం సోదరులు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఏప్రిల్ 25:** 12వ వార్డు ఆరిలోవ ఉన్న ముస్తఫా కోలని లో ఉన్న ,అహలే హదీస్ మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జుమ్మ నమాజ్ కు హాజరైనా ముస్లిం సోదరులు నమాజ్ అనంతరం పహల్గాం లో జరిగిన ఉగ్రవాదు లుల జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకులపై దాడి చేసి అనేకమంది మంది అమాయకులను హతమార్చినందుకు నిరసనగా ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు లు ధరించి నిరసన తెలియజేశారు. దాడి లో మరణించిన వారికి నివాళి అర్పించి ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారు. అనంతరం కమిటీ వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు అంతా కూడా భారతదేశానికి సంఘీభావం తెలియజేశారు. మేమంతా భారతీయులం. తీవ్రవాదులను అలాంటి మనస్తత్వం కలిగిన వారిని అల్లా కూడా క్షమించదు ఇది కురాన్ కి పక్కా వ్యతిరేకం అంటూ నినదించారు.

## సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరణ

- పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు
- పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారంకు ప్రత్యేకంగా "పోలీసు వెల్ఫేర్ డే"
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, ఏప్రిల్ 25** :విజయనగరం జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఏప్రిల్ 25న జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీక రించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కా రానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ – పోలీసు సిబ్బంది సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహిం చుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా కేంద్రం పోలీసు కార్యాలయంలోని తన ఛాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, బదిలీలు, మ్యూచు వల్ ట్రాన్స్ఫర్ కొరకు విజ్ఞాపనలను స్వీకరించా రు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగాస్పం దించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను, విన్నపాలను జిల్లా ఎస్పీ స్వయంగా నమోదు చేసుకొని, పరిశీ లించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## పోలీసు డాగ్ కెన్నెల్స్ నిర్మాణం పూర్తి చేసేందు కు చర్యలు

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం ఏప్రిల్ 25** :విజయనగరం జిల్లా పోలీసుశాఖలో నేర నియంత్రణ, చేధనలో విశేషంగా పని చేస్తున్న పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు నిర్మాణంలో ఉన్న డాగ్ కెన్నెల్స్ పూర్తి చేసేందు కు చర్యలు చేపట్టనున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 25న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – జిల్లా పోలీసుశాఖలో నేర నియంత్రణ, చేధనలో పోలీసు డాగ్స్ పాత్ర చాలా కీలకమని, వాటికి సరైన విశ్రాంతిని ఇచ్చి, తిరిగి వాటి సేవలను వినియోగించుటకు వాటి సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరము ఉందన్నా రు. పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు ప్రత్యేకంగా శాశ్వతమైన కెన్నెల్స్ లేకపోవడంతో ఎఆర్ పోలీసు లైన్స్ లోని పాత పోలీసు క్వార్టర్సును తాత్కాలిక కెన్నెల్స్ వినియోగి స్తున్నామన్నారు. ప్రస్తుతం పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు ఎటువంటి ఇబ్బంది లేనప్పటికీ భవిష్యత్తుఅవసరాల దృష్ట్యా పోలీసు డాగ్స్ కొరకు ప్రత్యేకంగా కెన్నెల్స్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ఎఆర్ పోలీసు లైన్స్ గతంలో నిర్మించి, సగంలో నిలిచిపోయిన డాగ్ కెన్నెల్స్ ను జిల్లా ఎస్పీ సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. కొన్ని అనివార్య కారణాలు వలన గతంలో నిర్మించి, సగంలో నిలిచిపోయిన కెన్నెల్స్ నిర్మాణం పూర్తి చేసి, డాగ్స్ విశ్రాంతి తీసుకొనేందుకు ప్రత్యేకంగా శాశ్వత కెన్నెల్స్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామ న్నారు. ఇందులో భాగంగా నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతిపాదనలను పంపాలని సెక్యూరిటీ ఆర్ఐని జిల్లా ఎస్పీ ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలు దృష్ట్యా జిల్లాకు స్నిఫర్, ట్రాకింగ్, నార్కోటిక్ డాగ్స్ అదనంగా వచ్చే అవకాశం ఉన్నందున డాగ్ కెన్నెల్స్ నిర్మాణం, ఆఫీసు రూం, డాగ్స్ కు ఫుడ్ ప్రిపేర్ చేసేందుకు ప్రత్యేకంగా కిచెన్ ఉండే విధంగా ప్రతిపాదనలుసిద్ధం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.
జిల్లా ఎస్పీ వెంట ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, సెక్యూరిటీ రిజర్వు ఇన్స్పెక్టర్లు టి.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, డాగ్ హ్యాండలర్స్ ఉన్నారు.





## వాసుపల్లి చొరవతో వృద్ధురాలికి ఆశ్రయం

39 వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ సహకారంతో ఆశ్రమంలో చేరిక



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 25** :దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైయస్ ఆర్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమా ర్ సహకారంతో తన వద్దకు సాయం కోసం వచ్చిన ఓ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. ఆశిలమెట్ట కార్యాలయం సమీపంలో అనాధగా జీవిస్తున్న వృద్ధురాలు పట్టించుకునే వారు కూడా దొరకని స్థితిలో ఉంటూ వాసుపల్లి సహకారం కోరింది. తక్షణమే స్పందించిన వాసుపల్లి గణేష్ కుమార్ 39 వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ తో వృద్ధురాలిని వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం కల్పించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులకు అప్పగించా రు. దక్షిణ నియోజకవర్గంలో పేదలకే కాకుండా అనాధలకు కూడా అండగా నిలబడే వాసుపల్లి గణేష్ కుమార్ సేవలపట్ల పలువురు ప్రశంసిస్తు న్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు







- జాతీయ స్థాయి గిరిజన కళా ప్రదర్శనలు, నృత్యోత్సవాలు
- జనజాతీయ క్రీడా మహోత్సవం – గిరిజన ఆర్చరీ మీట్
- వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులతో విలువిద్య పోటీలు

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, ఏప్రిల్ 25 :ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో విలువిద్య (ఆర్చరీ) పోటీలు నిర్వహిస్తోంది.. రాష్ట్రంలోని 27.39 లక్షల గిరిజనుల (ఎస్.టి.) సమగ్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ఉంది. రాష్ట్రంలో మొత్తం 34 షెడ్యూల్డ్ తెగలు, వాటిలో 11 ప్రత్యేకంగా బాధపడే తెగలు పివిటిజీలు ఉన్నారు. వీరి అభివృద్ధి కోసం రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పలు పథకాల ద్వారా అందగా ఉన్నాయి అన్ని మంత్రి తెలిపారు.ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా, రాష్ట్ర స్థాయి మరియు జాతీయ స్థాయి గిరిజన కళా ప్రదర్శనలు, నృత్యోత్సవాలు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు, గిరిజన పండుగలు విశాఖపట్నం, విజయవాడ మరియు ఐ టి డి ఎ ప్రాంతాల్లోని వివిధ చోట్ల నిర్వహించబడుతున్నాయి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిపేర్కొన్నారు. పీఎం-జన్మాన్ మరియు డీజీజాపి క్రింద దిగువ పేర్కొన్న అంశాలపై దృష్టి పెట్టి వాటిని సమంచి తంగా అమలు చేస్తున్నారు: పక్కా ఇళ్ల నిర్మాణం, రోడ్లను కలిపే కార్యక్రమాలు, పైప్ ద్వారా తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, హాస్టళ్ల నిర్మాణం %ఽ% నిర్వహణ, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం మరియు నిర్వహణ, బహుప్రయోజన కేంద్రాల నిర్మాణం, విద్యుత్తు లేని ఇళ్లకు విద్యుతీకరణ మొబైల్ టవర్ల సంస్థాపన, 0.3 కిలోవాట్ల సోలార్ ఆఫ్-గ్రిడ్ వ్యవస్థ ఏర్పాటు, వనధన వికాస కేంద్రాలస్థాపన కార్యక్రమాల గురించి మంత్రి తెలిపారు. జనజాతీయ సంవత్సర క్యాలెండర్లో భాగంగా, మార్చి 12, 2025న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి గిరిజన చిత్రలేఖన / కళల పోటీ నిర్వహించబడింది. ఈ మహా గిరిజన కళా పోటీలో రాష్ట్రంలోని ఐటిడిఎల మరియు జిల్లాల నుండి సుమారు 250 మంది గిరిజన కళాకారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. వారు తమ జాతిపరమైన కళా సాంప్రదాయాలు మరియు చిత్రలేఖన నైపుణ్యాలను ప్రదర్శించాము అని మంత్రి తెలియజేశారు అంతేకాకుండా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విలువిద్య విద్యార్థులు ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలు మరియు అండమాన్ %ఽ% నికోబార్ ద్వీప సమూహం నుండి వచ్చిన విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొంటు న్నారు.గిరిజన యువత తమ సంప్రదాయ విలువలను నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇది ఒక గొప్ప వేదిక. మన ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహి స్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్మెంట్ టి సి ఆర్ ఎం టి ఎం అధికారులకు, పాల్గొన్న విద్యా ర్థులకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ

- భక్తులకు మినరల్ వాటర్ సరఫరా ఆదివాసీ ట్రస్ట్ ద్వారా
- చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత





చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 25:-శ్రీముత్యాలమ్మ జాతర సందర్భంగా గ్రామంలో పంచాయతీ ద్వారా వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా మంచినీటి ని ప్లాస్టిక్ ట్యాంకులు ద్వారా పెట్టడం జరిగింది అలాగే శానిటైజేషన్ల పై ప్రత్యేక దృష్టిపెట్టి దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్న సర్పంచ్ దురియా పుష్ప లత, కార్యదర్శి శ్రీధర్ ఆర్డబ్ల్యూఎస్ జేఈ స్వర్ణలత నీటిని పొదుపుగా వాడుకోవాలని వృధాగా చెయ్యకుండా నీటి ఎద్దడి ఏర్పడుతుందని అలాగే పండగలో ప్లాస్టిక్ కవర్లను వ్యర్థాలను రోడ్లపై పడవేయ కూడదని, పంచాయతీ కి అందరూ సహకరించాలని, జాతర సందర్భంగా ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలం పడాల్ వచ్చే భక్తులకు మంచినీటికీ ఇటువంటి ఇబ్బందులు లేకుండా మినరల్ వాటర్ 1000 లీటర్లు కెపాసిటీ ట్యాంకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం పెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదివాసి ట్రస్ట్ సభ్యులు మోరు రవి తదితరులు పాల్గొన్నారు

# ముంచంగిపుట్టులో మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీ

- దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం.
- వైద్యాధికారిని శిరీష.





ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 25.ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి వైద్యాధికారిని శిరీష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది భారీ ర్యాలీగా తరలి వచ్చి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని శిరీష మాట్లాడుతూ.. మలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలో ఏటా లక్షలాది మంది మలేరియా బారిన పడుతున్నారని, ఎంతోమంది చనిపోతున్నారని దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న మలేరియా నివారణ దినోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు. మలేరియా దోమలు కుట్టడం వల్ల ఎర్ర రక్త కణాలు నాశనం అవుతాయని, మలేరియా దోమలు పుట్టరాదని, దోమలు కుట్టరాదని, దోమలను నిర్మూలిద్దాం, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడు దోమల వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. ఇంటి చుట్టూ మురుగు నీరు ఉండుటవలన దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. మలేరియా దోమలను అరికడదాం – వ్యాధులను అరికడదాం అంటూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యశాఖ పంతం – దోమల అంతం, అపరిశుభ్రత నివారిద్దాం – వ్యాధులు నిరోధిద్దాం, దోమల బెడద తప్పించుకో – వ్యాధులను దూరంగా ఉంచుకో, పరిశుభ్రత ఆరోగ్యానికి తొలిమెట్టు అనీ, దోమతెరలను వాడండి – దోమకాటు నివారించండి అనీ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళాకారుల సంఘ సభ

తాడేపల్లిగూడెం: పెన్ పవర్, ఏప్రిల్ 25:రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 26వ తేదీ శనివారం సాయంత్రం స్థానిక గీతా మందిరంలో 155 వ నెలవారీ సభా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబూరావు శుక్రవారం తెలిపారు. స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, బిజెపి నియోజకవర్గ ఇన్ ఛార్జి ఈతకోట తాతాజీ, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మహిళా శిల్పి దేవికారాణి ఉదయార్ , ఆర్ వి ఎస్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.
ఈ సందర్భంగా సంగీత విభావరి, అష్టావధానం నిర్వహిస్తారు. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అవధానం నిర్వహిస్తారు. తెలుగు పండితులు తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి సంచాలకత్వంలో పంపన సాయిబాబు, గోదావరి ప్రభాకర శాస్త్రి, దేవరకొండ రమణారావు, యండపల్లి పాండురంగాచార్యులు, లంక శంకర్, కోపల్లె శ్రీనివాస్, డాక్టర్ పసుపులేటి రామచంద్రరావు, సూరంపూడి వెంకటరమణ పృచ్ఛకులుగా పాల్గొంటారని వివరించారు.
మదర్ వన్నిని ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ వల్లభనేని శ్రీనివాస్ కు గౌరవ సత్కారం, కాకినాడకు చెందిన ప్రముఖ గాయకులు తిరుక్కోవల్లూరి వెంకటరామన్ కు కళా సత్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి కి ఉద్యోగ సేవా పురస్కారం అందజేయనున్నట్లు వివరించారు. పడమర విప్పర్రు గ్రామానికి చెందిన సీనియర్ తబలా కళాకారుడు పసల సూరిబాబు కు ఆర్థిక సత్కారం చేస్తారు

## టి. లక్ష్మీ నరసింహమూర్తి రచించిన బోధామృత శ్రీకృష్ణ గీత పుస్తకాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు.

మలేరియా అంతం మనతోనే



గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 25 : మండలంలోని జి. కొత్తపల్లి పి.హెచ్.సి వైద్యులు డా. నిఖిత ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది "ప్రపంచ మలేరియా దినోత్సవం "సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది "మలేరియా అంతం మనతోనే " అనే నినాదంతో అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం చేయొచ్చని నినాదాలు చేశారు. ఫ్రైడే డ్రై డే ఆవశ్యకతను తెలియజేస్తూ నీటినిల్వలు దోమలకు ఆవాసాలని పరిసరాలు పరిశుభ్రం గా వుంచు కోవాలని తద్వారా డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ర్యాలీ అనంతరం అందరితో మలేరియా నిర్మూలించుటకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు మస్తాన్, పవన్, రమణ, అప్పారావు, ధనరాజు, నాగేశ్వరరావు ఏ.ఎన్.ఎమ్ లు, ఆశాలు పాల్గొన్నారు.

# అద్దెలు తగ్గించకపోతే ఆత్మహత్యే



తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఏప్రిల్ 25:మున్సిపల్ షాపులకు పెంచిన అద్దెలు తగ్గించకపోతే ఆత్మహత్యలకైనా సిద్ధమని మున్సిపల్ షాపు లీజుదారులు జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. షాపులను మూసివేసి శుక్రవారం కృష్ణ బాలాజీ సెంటర్ నుంచి ఎన్టీఆర్ చౌక్, మున్సిపల్ కార్యాలయం వరకు షాపు లీజుదారులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందచేశారు. కమిషనర్ తో లీజుదారులు మాట్లాడుతూ తమకు ఎటువంటి నోటీసులు లేకుండా అద్దెలు పెంచడం దారుణం అన్నారు. కొన్ని సంవత్సరాలుగా మున్సిపాలిటీ షాప్ లు లీజు కు తీసుకొని జీవనం సాగిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తూ వచ్చామని, 3500 ఉన్న షాపు అద్దెను రూ. 10,000 కు పెంచడంపై లీజు దారులు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు. అప్పులు దొరక, వ్యాపారాలు లేక సతమతమవుతున్నామని ఇలాంటి సమయంలో అధికంగా పెంచిన లీజు ను కట్టాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. అధికారులు కనికరించాలని లీజుదారులు కమిషనర్ ని కోరారు. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కి ఇదే విషయంపై వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారని జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపారు.

## మలకపల్లిలో ప్రపంచ మలేరియా దినోత్సవం





తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 25:ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో "మనతోనే మలేరియా అంతం" అనే నినాదంతో మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించడం కొరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వైద్యాధికారిణి అన్నపూర్ణ మాట్లాడుతూ 2030 నాటికి మలేరియా నిర్మూలన మనందరి లక్ష్యమని, దీనికోసం మనమందరం దృఢ సంకల్పంతో కృషి చేయాలని, ఇది దోమకాటు ద్వారా వచ్చే ఒక అంటువ్యాధి అని చెప్పారు. ముఖ్యంగా చలితో కూడిన జ్వరం, తల నెప్పి, కండరాల నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు ఉన్నవారు అశ్రద్ధ చేయకుండ ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని అన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు పెరుగుతాయి కనుక ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీరు నిల్వ చేసే పాత్రలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, పూల కుండీలను వారానికి ఒకసారి శుభ్రం చేయాలని సూచించారు. కాలువల్లో వ్యర్థాలు, చెత్త చెదారలు వేయరాదని గృహాలోని కిటికీలకు దోమ తెరలను ఏర్పాటు చేసుకోవడం వంటి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.పి.సుచందన, ఇతర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సి .హెచ్ .సిలో ప్రపంచ మలేరియా దినోత్సవం....



అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రిల్25: అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్...
మలేరియా దినోత్సవం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు.
మలేరియా అంతం మనతోనే సాధ్యం అనే నినాదం తో మలేరియా వ్యాధి నిర్మూలన, ప్రజలలో, ఈ వ్యాధి పట్ల అవగాహనా కల్పించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.. ప్రపంచ వ్యాప్తంగా, 106దేశాలలో 3.3బిలియన్ ప్రజలు మలేరియా బారిన పడుతున్నారు. ఎక్కువ గా ఆఫ్రికా లో మలేరియా బారిన పడుతున్నారు అని హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు అన్నారు.. ఈ కార్యక్రమం లో ముఖ్యులు డాక్టర్. యమ్. అనిల్ కుమార్ జనరల్ మెడిసిన్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి వచ్చిన వారు అపోహ చెందావసరం లేదు హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ ని సంప్రదించాలి అని. ఈ వ్యాధి లక్షణాలుముందుగా ఎక్కువ గా చలి,రెండు మూడు దుప్పట్లు కప్పిన చలి తగ్గక పోవడం, తలనొప్పి, కళ్ళు తిరగడం, వొళ్ళు నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు, మలేరియా యొక్క తీవ్రత ను టెస్ట్ లు ద్వారా నిర్ధారించవచ్చిను. అలాగే హాస్పిటల్ లో చేసే మలేరియా టెస్ట్ ద్వారా డైయాగ్నోసిస్ చేయవచ్చు... అదేవిధంగా టెస్ట్ లో వచ్చిన రిజల్ట్ ను బట్టి మందులు తీసుకుని వేసుకో వాలి,ఎక్కువ గా మురికిగా ఉన్న నిల్వ నీరు ని తొలగించడం, వ్యాధి ఉన్న వక్తులకు దూరం గా ఉండడం, ఇంటి చుట్టూ పారిశుధ్య నిర్మూలన చేయడం, బ్లాతుం క్లీనింగ్ చేసుకోవడం, వంటివి చెయ్యాలి అని చెప్పారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ డాక్టర్స్ ప్రసన్న దేవి,అనూష, హాస్పిటల్ స్టాఫ్ వరలక్ష్మి, రామలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమారి, లక్ష్మి, శాంతి, సునీత, సీత జానికి దేవి,రామకృష్ణ, దేవుడు మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రదాడి దేశంపై కాదు హిందూ మతంపైనే

- సూర్యపీఠం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు
- తోట సాయిబాబు



**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 25:** జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిపై సూర్యపీఠం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబు స్పందించారు. శుక్రవారం సూర్యపీఠం సభ్యులు అక్షింతల రాజా,దోసపాటి సుబ్బారావు,పిల్లంగోరు పాపారావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో ఏమూల ఉగ్రదాడి జరిగిన దాని మూలాలు పాకిస్తాన్లోనూ దాని బాధితులు హిందువులై ఉంటారని అన్నారు. కుదిరితే హిందువులను మతం మార్చడం కుదరకపోతే హిందువులను చంపడమే లక్ష్యంగా విదేశీ ఉగ్రవాద స్థావరాలు స్వదేశీ మత ఛాందసవాద శక్తులు పనిచేస్తున్నాయన్నారు. భారతదేశంలో మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలు కారణంగా కొన్ని రాష్ట్రాల్లో హిందువులకు కనీస రక్షణ లేకుండా పోయిందని హిందువులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస వెళ్లే పరిస్థితులు మనం చూస్తున్నామని అన్నారు.

ఇకనైనా సెక్యులర్ మత్తులో ఉన్న స్వార్థపరులైన హిందువులు సెక్యులర్ వాదాన్ని శాంతి మంత్రాన్ని విడనాడి పోరాటానికి సిద్ధపడకపోతే హిందూమతం భూమ్మీద మిగలదని చరిత్రలో మాత్రమే మిగులుతుందని అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులందరూ భారత సైన్యానికి భారత ప్రభుత్వానికి నైతిక మద్దతును ప్రకటించాలని సాయిబాబు అన్నారు.

## ఉత్తీర్ణులకు అభినందనలు.. గ్రామాలకు మంచి పేరు తెండి..

- ఎమ్మెల్యే నల్లమిల్లి...





**అనపర్తి,పెన్ పవర్,ఏప్రిల్ 25 :** పదవ తరగతి పరీక్షలు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణులైన అనపర్తి నియోజకవర్గ విద్యార్థిని విద్యార్థులకు అభినందనలని, ఈ స్ఫూర్తితో ఉన్నత విద్య ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తును అందుకోవాలని తద్వారా కన్న తల్లిదండ్రులకు, పుట్టి పెరిగిన గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులతో విజయం సాధించిన మండలంలోని పాఠశాలల విద్యార్థులు శుక్రవారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిసి అభినందనలు అందుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా టాపర్గా నిలిచిన అనపర్తి బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన కోదండ రామ్ రెడ్డి, నల్లమిల్లి మూలారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరుసగా మూడు స్థానాలకు సాధించిన విద్యార్థినులను ఆయన అభినందించారు. ప్రశాంతి విద్యానికేతన్ లో మంచి మార్పులు సాధించి ఉత్తీర్ణులైన ఆయన అభినందించారు. ఈ అభినందన కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాణిక్యం ఠాగూర్ ను కలిసిన కామన ప్రభాకరరావు.



**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 25 :**అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ , భారత పార్లమెంటు లోక్ సభ విప్ మాణిక్యం ఠాగూర్ ను

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు కలిశారు . విజయవాడ లో శుక్రవారం ఆయన్ను కలిసి దుశ్శలువా తో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రభాకరరావు చేస్తున్న కృషి నీ ఆయన అభినందించారు.

# అభివృద్ధి, సంక్షేమం మేళవించి కూటమిపాలన చేస్తోంది.. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి..





**అనపర్తి,పెన్ పవర్,ఏప్రిల్ 25.** సుపరిపాలన అంటే అభివృద్ధి, సంక్షేమం ఈ రెండి%శీ%టినీ మేళవించి తీసుకెళ్లాలని ఆలోచనతో ఈవేళ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనపర్తి ఎస్ ఎన్ ఆర్ ఫంక్షన్ హల్ లో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ మరియు బీసీ కార్పొరేషన్, వి డబ్ల్యూ ఎస్ సహకారంతో అనపర్తి నియోజకవర్గం సంబంధించి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం (టైలరింగ్) ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ

ముందుగా పహల్గాం దగ్గర పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిముషాలు మౌనం పాటించారు.

గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులపాలు చేసి ఆర్థిక సంక్షోభం తీసుకువచ్చి%శీ%ది. ఇవాళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ప్రక్క ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేయాలని, ఒక పక్క మౌళిక వసతులు కల్పించాలి అనే ధేయంతో పని చేయడ%శీ% జరుగుతుంది. ముఖ్యంగా మీ అందరికీ తెలుసు గత ప్రభుత్వంలో రోడ్లు వ్యవస్థ ఏ విధంగా ఉందో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా సరిదిద్దుతుందో కూడా మీరంతా చూశారు. ఇవాళ కేంద్రం అందిస్తున్న సహకారం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వాటిని వినియోగిస్తున్నారు అన్నారు.

ఈ ఒక్కరోజు మీకు ఇక్కడ జరిగే కార్యక్రమం కోటి 30 లక్షల రూపాయలు విలువంటే, సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతా ఉన్నాయో ఆలోచన చేయమని మీరందరికీ విజ్ఞప్తి చేస్తూన్నా.

అదే విధంగా ఈ తొమ్మిది నెలల కాలంలో అనపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 90 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేసా%శీ%. ఆర్ అండ్ బి రోడ్లు ఏ విధంగా చేసామో చూసారు. అదే విధంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేస్తా ఉన్నాం. రేపు జల శక్తి మిషన్ కింద గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించాలని ముందుకు వెళ్తా ఉన్నాం. అదేవిధంగా గ్రామాల్లో అనేక దేవాలయాల పునర్నిర్మానం కోసం నిధులు ఇచ్చాం, అనేక చోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. ఇవాళ అన్ని విధాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని, సంక్షేమ దిశలో పయనించాలని లక్ష్యంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇవాళ ముందుకు వెళ్తా ఉంది. గతంలో జరిగిన నవరత్నాలు విషయంలో కానీ, ఇవాళ జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయి. గత ఐదు సంవత్సరాలు అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా జరిగాయి. దానిపైన బహిరంగ చర్చకు ప్రతి కూటమి నాయకులు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డికి ఈ సందర్భంగా తెలియజేస్తున్నా.

అదే విధంగా సంక్షేమంపైన బహిరంగ చర్చకి రండి. బహిరంగ చర్చకి రమ్మంటే మీరు ఎస్పీకి ఫిర్యాదులు చేయడం కాదు, కనీసం సోలో వీడియోలు, ఎడిట్ చేసిన వీడియోలు రిలీజ్ చేస్తున్న పరిస్థితిలో ఉన్న మీరు చర్చ అంటే ఏంటో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారు. నాలుగు మండలాల్లో కూడా ఈ శిక్షణ తరగతులు జరుగుతాయి. మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో దాదాపు 60 రోజుల పాటు పాల్గొనడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు వారిని కంటికి రెప్పలా శిక్షణ సమయంలో వారికి కావలసిన అవసరాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలు ఎక్కడా తప్పిదం జరగకుండా చర్యలు తీసుకోమని కోరుతున్నా. నాయకులందరూ మీ మీ గ్రామాల్లో డిసెంబర్ 23 నుంచి ఈరోజు వరకు ఏదైతే పెండింగ్ అప్లికేషన్స్ ఉన్నాయో అవన్నీటిని మరలా మీరు ఎంపీడీవోలు దృష్టి తీసుకువచ్చిన గ్రామంలో ఆ లబ్ధిదారులతో టచ్ లో కెళ్ళడం వాళ్ళ అప్లికేషన్ తీసుకొచ్చి ఎంపీడీవోలకు ఇచ్చి కోఆర్డినేట్ చేసి ఒకటో తేదీన వాళ్ళందరికీ పెన్షన్ తీసుకునే బాధ్యత మీ అందరూ తీసుకోమని కూటమి నాయకులు అందరికి విజ్ఞప్తి చేస్తున్న. ఈ కార్యక్రమంలో మహిళలు,అనపర్తి నియోజకవర్గం ఎన్ డి ఏ నాయకులు, అనపర్తి టౌన్ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, మహిళలు పాల్గొన్నారు.



## జయపురం పంచాయతీ రికార్డులు ఏమయ్యాయి..?

**ఏలూరు పెన్ పవర్ ఏప్రిల్ 25 :** ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం జయపురం గ్రామపంచాయతీ రికార్డులు గల్లంతయ్యాయి అని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం స్వయంగా జయపురం గ్రామ పంచాయితీ ఇంచార్జ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి సహ చట్టం దరఖాస్తుదారుడికి పేర్కొనడం లిఖిత పూర్వకంగా పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోంది. సహా చట్టం ద్వారా దరఖాస్తుదారుడుకి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాచారంలో గతంలో పనిచేసిన కార్యదర్శులు తమకు రికార్డులు అప్పగించలేదని, అందువలన గ్రామ పంచాయతీలో ఏ రికార్డులు అందుబాటులో లేవని పేర్కొనడం గమనార్హం. గ్రామ పంచాయతీల కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన ఈవో ఆర్ డి, ఎండిఓ పర్యవేక్షణ లేకపోవడంతో రికార్డుల నిర్వహణ జయపురం గ్రామపంచాయతీలో అష్టవ్యష్టంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగకపోగా కనీసం గ్రామ పంచాయతీకి సొంత భవనం కూడా సమకూర్చలేకపోయిందనే వాదన గ్రామస్తులు నుండి వినవస్తోంది. మండల స్థాయి అధికారులు ఏడాదికో సారి సమీపంలోని పాత ముప్పర్రు గ్రామ పంచాయతీకి జయపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిని పిలిపించుకొని పరిపాలన సంబంధమైన సర్వేలు, ఇతరత్రా అంశాలపై రీచార్జిస్తున్నారే తప్ప, గ్రామంలో నెలకొన్న సమస్యలపై మండల స్థాయి అధికారులు, డివిజనల్ స్థాయి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు అని గ్రామస్తులు వాపోతున్నారు. తమ సమస్యలను విన్నవించు కోవడానికి గ్రామంలో పంచాయతీ కార్యాలయం లేదని, తమ సమస్యలను చెప్పుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత ముప్పర్రు ఇన్చార్జి కార్యదర్శి ని కలవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జయపురం గ్రామ పంచాయితీకి ఐదేళ్ల కాలంలో రెగ్యులర్ కార్యదర్శి కనీసం ఒక సంవత్సరం కూడా విధులు నిర్వహించని కార్యదర్శికి,ప్రొబేషన్ పూర్తికాకుండానే, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు లేకుండా, విధుల్లో చేరడానికి, బెనిఫిట్స్ పొందడానికి మండల పరిషత్ కార్యాలయంలో ఓ విస్తరణాధికారి సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ విస్తరణ అధికారి పెదపాడు మండలంలో పనిచేస్తూ పెదపాడు గ్రామపంచాయతీలో వైసీపీ నేత బంధువు కొళాయి కనెక్షన్లు,ఇంటి పన్నుల వ్యవహారంలో డిమాండ్ నోటీస్ ఇవ్వకుండా రెండు లక్షలు గ్రామ పంచాయతీ నిధులు పక్కదోవ పట్టించారనే వ్యవహారంలో దర్యాప్తు అధికారిగా వ్యవహరించి వైకాపా నేతలకు సానుకూలంగా సహకరించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో అదే గ్రామ పంచాయతీలో క్రింది స్థాయి ఉద్యోగిని బాధ్యుడిని చేస్తూ అక్కడి వద్ద నుండి రూ.2 లక్షలు వసూలు చేసి గ్రామ పంచాయతీకి జమ చేసినట్టు చూపారని విమర్శలు ఉన్నాయి. అదే అధికారి మండలంలో సాల్వెన్సీ సర్టిఫికెట్ పై సంతకం పెట్టాలంటే రూ. 1000/- ఇవ్వనిదే సంతకం చేసేవారు కాదని సాల్వెన్సీకి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు చెబుతున్నారు.

**రికార్డులు అప్పగింతపై కార్యదర్శులు**

రికార్డులు అప్పగింత విషయమై జయపురం గ్రామ పంచాయతీ ఇన్చార్జ్ కార్యదర్శులుగా పనిచేసిన నాగబాబు, పాల్, ఫణి రాజకుమారి లను వివరణ కోరగా తాము ప్రస్తుతం ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న కార్యదర్శికి రికార్డులు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.

## భారతీయ ముస్లిం లను ఉగ్రవాదులతో ముడి పెట్టి చూడొద్దు.

**మారణకాండ కు పాల్పడిన వారిని అల్లా ఖచ్చితంగా శిక్షిస్తాడు.**

**మండపేట శాంతి ర్యాలీలో ముస్లిం నేతలు.**

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 25 :**భారతీయ ముస్లిం లు అందరి లోనూ అణువణువునా భారతీయత నిండి ఉందని ముస్లిం నాయకులు ఎండి అతవూర్ రెహమాన్, సల్మాన్ హుస్సేన్, ఎండి ఖదరీకరీం, సయ్యద్ ఇబ్రహీం షరీఫ్ లు పేర్కొన్నారు. దేశంలో నివసిస్తున్న ముస్లింలను ఉగ్రవాదులతో ముడి పెట్టి చూడవద్దని పేర్కొన్నారు. మండపేట లో శుక్రవారం మధ్యాహ్నం జుమా ప్రార్థనలు అనంతరం హానపీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్, సైదల్లి పేట లోని హజరత్ హంజా మస్జిద్, గాంధీ నగర్ ఆల్ అమీనా మస్జిద్, విజయలక్ష్మి నగర్ లోని ఆల్ ఆక్సా మస్జిద్ మసీదు కమిటీ ల ఆద్వర్యంలో మండపేట లో పహాల్గం మృతులకు నివాళులు అర్పిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. మండపేట పెద్ద మసీదు కలువపువ్వు సెంటర్ నుండి రాజారత్న సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జామియా మస్జిద్ కమిటీ ఛైర్మన్ అతఉర్ రెహమాన్, మాజీ హజ్ కమిటి సభ్యులు సల్మాన్ హుస్సేన్, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం షరీఫ్, మెకానిక్ కరీం లు మాట్లాడుతూ ఇస్లాం మారణకాండ కు పూర్తి వ్యతిరేకమన్నారు. పహల్గావ్ ఘటనకు పాల్పడిన వారిని అల్లా క్షమించడన్నారు. వారితో భారతీయ ముస్లింలను ముడి పెట్టి చూడటం బాధిస్తోందన్నారు. ఘటనలో మృతులకు అశ్రునివాంజలి ఘటించారు. ఓ పక్క వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తమను వేధిస్తున్నా ఆ బాధను పంటి బిగువున దాచిపెట్టి ఈ దేశం కోసం తామంతా ముందుకు వచ్చామన్నారు. తమకు ఈ దేశం మాత్రమే ముఖ్యమని ఉద్ఘాటించారు. ఐక్య వేదిక నాయకులు దూలి జయరాజు మాదిగ, బిజెపి ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణలు మాట్లాడుతూ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే సింధు జలాల ఒప్పందం రద్దు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. భవిష్యత్ లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ మరింత బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జామియ మస్జిద్ ఇమామ్ మహమ్మద్ గులాం మొహమ్మద్ ముర్షిద్ రజ్వీ, మస్జిద్ అధ్యక్షులు ఎండి అత వూర్ రెహమాన్, ఎండి కరీం ఖాదారీ, గాంధీనగర్ అల్ ఆమీన్ మస్జిద్ అధ్యక్షులు ఫారుఖ్ అలి, అక్సా మస్జిద్ అధ్యక్షులు షేక్ మౌలాలీ, హంజ మస్జిద్ అధ్యక్షులు ఎండి అర్షి, జమాఅతె ఇస్లామీ జిల్లా అధ్యక్షులు అమిర్, షరీఫ్, ఏపిజె చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ మౌలానా, మెజానిక్ కరీం, సయ్యద్ మీర్ అరిఫ్, సర్కారు, షేక్ గౌ మొహిద్దిన్, సయ్యద్ అలిషా గాంధీ, షహిద్, కమాల్, గాలంకి నాగేశ్వరరావు, మస్జిద్ కమీటి సభ్యులు,ఆధిక సంఖ్యలో ముస్లిం, హిందు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



## కోడిపందేలపై పోలీసులు దాడి

భారీగా నగదు, మోటార్ సైకిళ్ళు స్వాధీనం






**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రియల్ 25:** జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఉత్తర్వుల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై సత్య కిషోర్ పర్యవేక్షణలో కోరుకొండ ఎస్సై టి శ్యామ్ సుందర్ తన సిబ్బంది , జిల్లా స్పెషల్ పార్టీ తో కలిసి తమకు రాబడిన సమాచారం మేరకు గురువారం రాత్రి మధురపూడి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న వారిపై సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 26 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుండి 96,770 రూపాయల నగదు, 25 సెల్ ఫోన్లు,3 కార్లు, 20 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోరుకొండ మండలంలో వివిధ గ్రామల పరిధిలో పేకాట ,కోడిపందేలు ఆడుతున్న వారిపై సమాచారం ఇచ్చిన వారి ఆచూకీ గోప్యంగా ఉంచుతూ సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడునని ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు.

## ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేసిన బోడ అనీష్ కుమార్



**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:25:**యు.కె పర్యటన పూర్తిచేసుకుని నియోజకవర్గానికి విచ్చేసిన శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ని క్యాంప్ ఆఫీస్ లో కలిసి శాలువా కప్పి, అనంతరం పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఐటీడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, అనంతరం బోడా అనీష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, పరిశ్రమల స్థాపన ద్వారా నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని రూపుమాపడమే లక్ష్యంగా నియోజకవర్గానికి పెట్టుబడుల కోసం యూ.కే వెళ్లి, తమకోసం అహర్నిశలు శ్రమిస్తుండడంతో, నియోజకవర్గ నిరుద్యోగ యువత అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని అనీష్ అన్నారు.

# గిరిజన జీవన ఉపాధికి పెరటకోళ్ల పంపిణీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు

**బుట్టాయగూడెం,పెన్ పవర్, ఏప్రిల్:25:**బుసరాజుపల్లి క్యాంప్ కార్యాలయం నందు ట్రైకార్ చైర్మన్ శ్రీ బొరగం శ్రీనువాసులు ఆధ్వర్యంలో హైపర్ ఇంటర్నేషనల్ సంస్థ బుట్టాయిగూడెం కార్యాలయం వద్ద గిరిజన జీవన ఉపాధి మెరుగుపరచడం కోసం పెరటికోళ్ల పంపిణీ ట్రై కార్ హైపర్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో త్వరలో చేపట్టడం జరుగుతుంది, దానికి అవగాహన కార్యక్రమం ట్రైకర్ ఎండి, హైఫర్ ఇంటర్నేషనల్ సౌత్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామ్ కుమార్ సమక్షంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ యొక్క ప్రాజెక్ట్ ఉద్దేశం గిరిజన ప్రజలు తమ యొక్క జీవన విధానాన్ని మెరుగుపరచుకోవటానికి, పోషక విలువలతో కూడిన ఆరోగ్యాన్ని పెంపొందించుకోవటానికి పెరటి కోళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రతి గిరిజన రైతు ఈ పథకంలో భాగంగా పెరటి కోళ్లను పెంచుకొని తమను జీవన విధానాన్ని మెరుగు పరుచుకోవాలని, ఆర్థిక స్వావలంబన పెంపొందించు కోవాలని కోరారు, త్వరలో అన్ని గ్రామాలలో హైపర్ ఇంటర్నేషనల్ బౌ అండ్ యారో స్వచ్ఛంద సంస్థలు ద్వారా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తారని తెలియపరిచారు, ఈ కార్యక్రమంలో ట్రైకర్ ఎండి మణికుమార్, హైపర్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామ్ కుమార్, హైపర్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ సునీత రంజుల,పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి బుచ్చారావు, బౌ అండ్ యారో సంస్థ సెక్రటరీ మణికంట, బుట్టాయిగూడెం పోలవరం, జీలుగుమిల్లి మండలాల అధికారులు రైతులు పాల్గొన్నారు.



## వేసవి విద్యా శిక్షణ తరగతులను సందర్శించిన ఉప విద్యాశాఖాధికారి.



**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 25 :**పాలడుగు సత్యవతి చంద్రమౌళి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిక్షణా తరగతులను రామచంద్రపురం డివిజన్ ఉపవిద్యా శాఖాధికారి
పి. రామలక్ష్మణమూర్తి సందర్శించారు.ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మక వైఖరిని, మంచి చేతిరాతను అలవర్చుకోవాలని కోరారు. భాష, గణిత విజ్ఞాన శాస్త్ర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు.15 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ గా మండల విద్యాశాఖాధికారి సిహెచ్. సోమిరెడ్డి, కన్వీనర్ గా పడాల రామచంద్ర రెడ్డి వ్యవహరిస్తున్నారు. పాఠశాల హెచ్ఎం
వి .వి .కే మందేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సనల్ గా ఎన్సీ రామానుజం, జి. శ్రీనివాస్
కే .శ్రీనివాసరావు
ఎస్. వి. కె. పి .వాణి వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు కూలింగ్ మినరల్ వాటర్ నిమిత్తం పిఎస్ టీచర్స్ ఫోరం తరపున ఆర్థిక సహాయం ఉప విద్యాశాఖాధికారి కి అందజేసినట్లు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు గండి స్వామి ప్రసాద్ తెలియజేశారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:25:**సబ్ యూనిట్ పరిధిలో 25 తేదీన మలేరియా నిర్మూలనకు అవగాహనా ర్యాలీ సబ్ యూనిట్ ఆఫీస్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగినది, మరియు మానవ హారం గా ఏర్పడి మలేరియా నిర్మూలన పై చింతలపూడి యస్ యు ఓ ప్రసాద్ ప్రజలకు అవగాహనా కల్పించి నారు,ఇందులో భాగంగా చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎర్రగుంటపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీత, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాస్, హెచ్ యస్ రవి, రాఘవాపురం, ఏ యస్ యమ్ యస్ ఆశవర్కర్లు, ఎర్రగుంటపల్లి పి హెచ్ సి ఏ యస్ యమ్ యస్ ఆశ వర్కర్లు,యమ్ పి హెచ్ ఏ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడల పోటీలలో ప్రతిభ కనబరిచిన కోనసీమ జిల్లా దివ్యాంగ విద్యార్థులు : డి ఇ ఓ షేక్ సలీం భాషా



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం , ఏప్రిల్ 25 :** రాష్ట్రస్థాయి లో జరిగిన దివ్యాంగుల క్రీడలలో కోనసీమ జిల్లా దివ్యాంగ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచారని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష తెలిపారు శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహించిన క్రీడా పోటీలలో విద్యార్థులు
యాండ్రా జాహ్నవి 50 మీటర్ల పరుగులో రజత పతకాన్ని సాధించారన్నా రు. అదేవిధంగా జానా రేఖ చంద్రమౌళి,వెంకటలక్ష బోసి గేమ్ లో వెండి పతకం లభించిందన్నారు యస్ వీర వెంకట గౌత మ్.100, 200,మీటర్ల పరుగులో రజత పథక%శీ% సాధించటం జరిగిందన్నా రు . ఈ క్రీడలకు శిక్షణ ఇచ్చిన కోచ్లు, ఎన్ హిమబిందు. ఎన్ వెంకటేశ్వర రావు. జి సురేష్ లను డీఈవో భాష ప్రశంసించడంతోపాటు వారికి ప్రత్యేకంగా జ్ఞాపికలను బహుకరించా రు ఈ కార్యక్రమం లో ముమ్మిడివరం మండల విద్యాశాఖ అధికారులు శ్రీ.డి.గౌరీ శంకర్, శ్రీ.ఆర్. ఉదయ భాస్కర్ రావు గార్లు మరియు జిల్లా సహిత విద్య సమన్వ యకర్త ఎం వి.వి సత్యనారాయణ క్రీడల్లో పురస్కారాన్ని అందుకున్న దివ్యాంగ చిన్నారులు, మరియు వారి తల్లిదండ్రులు, ఐఇఆర్టీలు వీరికి ప్రత్యేకంగా శిక్షణ కోచ లు పాల్గొన్నారు.

## మొగలిపాలెంలో ఒనుములమ్మ జాతర



**కాజులూరు,పెన్ పవర్, ఏప్రిల్ 25:** మండల పరిధిలోని మొగల పాలెం గ్రామంలో శనివారం జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు మీడియాకు తెలిపారు.ఈ జాతర మంజేరు,మొగలిపాలెం గ్రామాల సరిహద్దులో ఉన్నగ్రామాల ఉమ్మడి గ్రామ దేవతగా గ్రామస్తులు కొలుస్తారు.ప్రతి ఏడాది ఉగాది అనంతరం వచ్చే అమావాస్య రోజున గ్రామంలో అమ్మవారి జాతర,తీర్థ మహోత్సవాలు నిర్వహించా దం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. మంజేరు గండివారి ఆడపడుచుగా పిలువబడే ఒనుములమ్మను మంజేరు,శీల మొగలిపాలెం గ్రామాల ప్రజలు నుంచి పూజలందుకుంటుంది.శనివారం రాత్రి జాతర,ఆదివారం మధ్యాహ్నం 12గంటలు నుండి తీర్థ మహోత్సవ కార్యక్రమం జరగ నుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## నా జోలికి గానీ నా కుటుంబం జోలికి వస్తే చూస్తూ ఊరుకోం...



- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి పై
- ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ జెడ్పిటిసి శేషారత్నం...

**అనపర్తి,పెన్ పవర్,ఏప్రిల్ 25 :** రాజకీయాలు ఉంటే రాజకీయంగా మాట్లాడుకుందాం.. అవాస్తవాలను వాస్తవాలుగా మార్చి కుటుంబాలకు మెలిక పెట్టి మాట్లాడుతూ నా జోలికి గానీ, నా కుటుంబం జోలికి గానీ వస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఉన్నతమైన కుటుంబం నుండి వచ్చావని మీరే చెప్పారు. ఆ కుటుంబం అంతా నా వెనుక ఉంది కాబట్టి ఆలోచించుకుని మాట్లాడితే మంచిగా ఉంటుందని అనపర్తి మాజీ జడ్పిటిసి కర్రి శేషారత్నం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డికి హితవు పలికారు . పత్రికలలో సోషల్ మీడియాలో అధికార ప్రతిపక్ష నాయకులు మధ్య జరుగుతున్న మాటలు యుద్ధంలో భాగంగా పది రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి ని ఉద్దేశించి శేషారత్నం ప్రెస్ మీట్ లో చెప్పిన అంశాలపై శుక్రవారం ఆయన స్పందించిన దానికి ప్రతిగా ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే డా" సత్తి సూర్యనారాయణరెడ్డి పై నేను పది రోజులైంది ఆయనకు కౌంటర్ ఇచ్చి. దానికి సమాధానం చెప్పకుండా వేరే వేరే ఏదో మాట్లాడటానికి ఆయన ప్రయత్నం చేస్తున్నారు.
2006 లో మాకు మీరు 40 లక్షలు ఇస్తామని కబురు చేయడం వాస్తవం కాదా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి. కే శే వీరెడ్డి, లచ్చారెడ్డి వచ్చి సాక్ష్యాలు చెప్పారు. భూమిపై లేని వారిని సాక్ష్యాలుగా చూపించి తప్పించుకునే దోరణితో ఆత్మ వంచనచేసుకుని మాట్లాడకండి. నేను మీ గురించి వ్యక్తిగతంగా మాట్లాడానని అంటున్నారు. నేను ఏ విషయం మాట్లాడాను. వ్యక్తిగత విషయాలేమీ నేను మాట్లాడలేదు కానీ మీరు మాట్లాడారు. పది రోజులు ఆలోచించుకుని చివరకు మా పీఠంపై మీ కన్ను పడినట్టుంది.
అనపర్తిలో రెండే సత్రంగాలు నడుస్తున్నాయి. వీరుళ్ళమ్మ సత్రంగం, బాపనమ్మ సత్రంగం. వాటికి నాకు సంబంధం లేదు. మీ అనుచరులే వాటిని నడుపుతున్నారు. వాళ్ళని అడగండి ఎంత డబ్బు ఉందో.
ఇక మా ఇంటి దగ్గర పీఠం నిల్ బ్యాలెన్స్ తో మొదలైంది. ఇపుడు కొంత డబ్బు, బంగారం ఉంది. మా పీఠానికి ఎంతమంది కమిటీయో కూడా మీకు తెలియదు. మేం అయిదుగురు కమిటీ ఉన్నాం. నా దగ్గర ప్రతీ పైసాకి అకౌంటు ఉంది. మీరు గానీ మీకు చెప్పిన మీ అనుచరులు గానీ వస్తే అకౌంట్లు చూపిస్తాన్నారు. మీరు నన్ను ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చారు మీ గురించి మాట్లాడితే మీ కుటుంబం పరువు పోతుంది అన్నారు. యెస్.. నేను ఉన్నతమైన కుటుంబం నుంచే వచ్చాను. నేను నా కుటుంబం పరువు పోయే రాజకీయం ఎప్పుడూ చేయలేదు. నిరూపించండి మీకింకా ఎన్నో విషయాలు తెలుసంటున్నారు కదా. ఇపుడు ఇదేలా చెప్పారో అవి కూడా చెప్పండి. నా కుటుంబానికి అపకీర్తి తెచ్చే పని నేనెపుడూ చేయలేదు.. చేయనుకూడా. నన్ను మీరే పార్టీలో ఉన్నారో తెలియదు లేదు అన్నారు. మీరు అనపర్తిలోనే ఉన్నారాండి. నేను ఏ పార్టీలో ఉండి రాజకీయం చేస్తున్నాను తెలియకపోతే మీరు నాయకుడిగా ఉనికి కోల్పోతున్నారన్న విషయాన్ని తెలుసుకోండి. నేనే పార్టీలో ఉన్నాను అని మీరే అడిగి కూటమి అని మీరే సమాధానం చెప్పుకున్నారు. మీరు ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి వచ్చారు? కాంగ్రెస్ నుండి వైయస్సార్ సిపిలోకి మీరు మారలేదా? పార్టీలు మారడం గురించి మాట్లాడే అర్హత మీకు లేదు. గురువింద పూస గురించి మీరు చెప్పారు కానీ అది మీకే వర్తిస్తుంది. మహిళని అని నన్ను కించపరచడానికి మీరు మాట్లాడితే పద్ధతిగా ఉండదంటూ శేషారత్నం హెచ్చరించారు . ఈ సమావేశంలో బిక్కవోలు పెదపూడి మాజీ ఎంపీపీలు వేణమ్మ సూర్య కుమారీలు పాల్గొన్నారు.

## తీవ్ర వాద చర్యలను ఖండించిన అమలాపురం బార్ అసోసియేషన్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం, ఏప్రిల్ 25 :** కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని అమలాపురం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించిన న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించారు. పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలు విడనాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పరువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఇటువంటి దు శ్చర్యలను భవిష్యత్తులో పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరిన సాయి ప్రధాన కార్యదర్శి నందికి శ్రీను అడపా ప్రసాద్ సందెపు చిన వెంకటేశ్వరరావు బదురు భాస్కర్ జోగేష్ మట్టపర్తి అచ్యుతానంద్ వై. సత్యనారాయణ భాస్కర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ సన్నిధిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 25 :** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, దేవస్థానం సిబ్బంది రమణ, వేద పండితులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వో, మహిళా పోలీస్ సమక్షంలో నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు





**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:25:**ప్రొహిబిషన్ %ం% ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో నాగిరెడ్డిగూడెం గ్రామము లో రాబడిన విశ్వసనీయ సమాచారము ప్రకారము నాటు సారాయి స్థావరాలు పై గ్రామ వీఆర్వో, గ్రామ మహిళా పోలీస్ సమక్షంలో చేసిన దాడుల లో వడిత్యా లక్ష్మీ అను మహిళ తప్పించుకొని పారిపోగా,తన ఇంట్లో నాటు సారాయి బట్టి ను కనుగొని,తనకు సంబంధించిన ప్లాస్టిక్ డ్రమ్ము లో వంద లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి,పదిహేను లీటర్ల నాటు సారాయి ను స్వాధీన పరచుకొని,ఆ మహిళ పై పరారీ కేసు నమోదు చేయడమైనది,
అలాగే మండలం లోని పాత నాటు సారాయి కేసులలో నిందితుడు గా ఉన్న భూక్యా గోపి ను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట 129 బి యన్ యస్ యస్ చట్ట ప్రకారం హాజరు పరచి,బైండ్ ఓవర్ నమోదు చేయడమైనది,
ఈ దాడులలో స్థానిక ఎక్సైజ్ ఎస్.ఐ. అబ్దుల్ ఖలీల్,సిబ్బంది పాల్గొన్నారు అని సి. ఐ.పి.అశోక్ తెలిపారు.

# న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం



జడ్జి గూడూరి హర్షవర్ధన్

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 25 :** ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థకు ఉన్నత స్థానం ఉన్నదని ఆ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులు, న్యాయమూర్తులపైన ఉందని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి గూడూరి హర్షవర్ధన్ అన్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారులను బదిలీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న గూడూరి హర్షవర్ధన్ పెద్దాపురం నుంచి విజయనగరం జిల్లా సాలూరుకు బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం స్థానిక కోర్టులో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన చట్టాలను అమలు చేయడంలో ఏ వ్యవస్థ విఫలమైనప్పటికీ న్యాయవ్యవస్థ ముందుకు వచ్చి సదరు వ్యవస్థను గాడిలో పెట్టడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. ఇతర వ్యవస్థలు చేస్తున్న తప్పులను సరిదిద్దే స్థానంలో న్యాయవ్యవస్థ ఉన్నదని, అందుకే న్యాయవ్యవస్థకు మన రాజ్యాంగం ఉన్నత స్థానం కల్పించిందన్నారు. న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు తనకు ఎంతో సహకరించారని గుర్తు చేసుకున్నారు. వారి సహకారం వల్లే సామాన్యుల కోసం ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించడానికి అవకాశం కలిగిందని చెప్పారు. విధి నిర్వహణలో తనకు సహకరించినందుకు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి. చంద్రమౌళీశ్వరి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె. దీపా దైవకృప, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గండిపోము బుల్లెమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం (మణి), ఉపాధ్యక్షుడు మడికి రాంబాబు, జనరల్ సెక్రటరీ పిట్ల రమణ, ట్రెజరర్ దారా శ్రీనివాస్, న్యాయవాదులు సాదే నరసింహారావు, చావలి కృష్ణారావు, సిహెచ్ కనక దుర్గారావు, గన్నంరాజు సత్యనారాయణ, అళ్ళక్కి కృష్ణ, ఎస్.వి.ఎస్.మూర్తి, డి.వి.ఎస్. ప్రకాశరావు, ఎస్. కాశీ సోమేశ్వరరావు, దేవులపల్లి రవికుమార్, కందుల వెంకటచలం, షేక్ వల్లిబాబు, ముమ్మన సోమరాజు, పి. మృత్యుంజయరావు, వినయ్ తేజ, సిహెచ్ చంద్రశేఖర్, నకరు దుర్గారావు, రాగం కామేశ్వరరావు, కె. గణేష్, పి. బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ ప్రాజెక్టుగా రాజధాని..?



**విజయవాడ, ఏప్రిల్ 26, పెన్ పవర్:** నవ్యాంధ్ర రాజధాని అమరావతిని.. ఇప్పటి వరకు ఊహిస్తున్న దానికి భిన్నంగా.. మరింత డెవలప్ చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ప్రయత్నాలుచేస్తోంది. దీనిలో భాగంగా.. రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారులతో రాజదానిని అనుసంధానించే ప్రక్రియకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తయితే.. అమరావతి.. అందరిదీ అనే భావనను మరింత పెంచి.. దీనిని పొరుగు రాష్ట్రాలకు కూడా చేరువ చేయనున్నారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేవారిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి మరో 30-40 వేల ఎకరాల భూమిని సేకరించే దిశగా అడుగులు వేసింది. ఇది పూర్తయ్యేందుకు రెండేళ్ళ గరిష్ఠ సమయాన్ని నిర్దేశించుకుంది. ఇక, ఈ క్రమంలోనే రహదారుల విస్తరణకు కూడా.. కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా.. చెన్నై-కోల్‌కతా-హైదరాబాద్‌లతో రాజధానిని అనుసంధానించే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 2015-19 మధ్యే దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించినా.. వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. కానీ.. ఇప్పుడు దీనిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా.. రాజధానిని దేశవ్యాప్తంగా.. అన్ని ప్రాంతాలకు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనిలో కీలకమైన మూడు రహదారులపై మాస్టర్ ప్లాన్‌రెడీ చేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్-5, ఎలివేటెడ్ కారిడార్-13, నేషనల్ హైవే %-% 13లను నిర్మించి..వాటి ద్వారా హైదరాబాద్, చెన్నై, కోలకత వంటి నగరాలకు అమరావతిని కలుపుతారు.. తద్వారా.. దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. పలువురుపెట్టుబడి దారులు.. కూడా..ఈ మార్గాలపై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించారు.

దీంతో ఈ విషయంపై తాజాగా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.అదేసమయంలో కేంద్రానికి కూడా సమాచారం పంపించి.. ఆయారహదారుల నిర్మాణంపై క్లారిటీతీసుకుంటారు. దీంతో అమరావతి రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా మరింత తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు.

పటేల్ తరహాలో

అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని నీరుకొండపై 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ బేస్‌లో ఎన్టీఆర్ జీవితం, కళాకృతులు, మినీ థియేటర్ తదితరాలు ఉండనున్నాయి. డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు ఆహ్వానించారు. నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల కిందట మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించి వచ్చారు. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది. దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు. ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# వంశీ ఇంకెన్నాళ్లు...

**విజయవాడ, ఏప్రిల్ 26, పెన్ పవర్:**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు.

తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు. తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

**కేడర్ లోనూ నిరుత్సాహం**

గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు.. కూడా పార్టీకి దూరమయ్యారు. ఈ క్రమంలో ఇప్పుడు కీలకమైన కార్యకర్తల వంతు వచ్చింది. ఏ పార్టీకైనా.. నాయకులతోపాటు.. కార్యకర్తలు చాలా కీలకం. నాయకులు జంప్ చేస్తారు..కానీ.. కార్యకర్తలు మాత్రం ఎంతో కొంత అంకిత భావంతో పార్టీలను అంటిపెట్టుకుని ఉంటారు. ఎన్నికల సమయంలోనూ..వారే కీలకం.ఈ విషయాన్ని గుర్తించే.. దాదాపు అన్ని పార్టీలూ..కార్యకర్తలే తమకు బలమని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతాయి. కార్యకర్తల సెంట్రిక్‌గా అనేక కార్యక్రమాలు కూడా చేపడతాయి. అయితే.. వైసీపీ విషయానికి వస్తే.. కార్యకర్తలనను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో వలంటీర్లే సర్వస్వంగా అప్పట్లో సీఎం జగన్ వ్యవహరించారు. ఇది పార్టీకి మేలు చేయకపోగా.. ఓడించేసింది. తద్వారా.. పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న చర్చ ఉంది.ఇంత పరాభవం తర్వాత.. ఒకటి రెండు సార్లు.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నానని జగన్ చెప్పుకొచ్చా రు. కానీ..

నెలలు గడిచిపోతున్నా.. ఆయన కార్యకర్తల విషయంలో ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవడం లేదు. గుర్తింపు అంతకన్నా లేదు. పైగా.. టీడీపీ సహా కూటమి నాయకులు.. కార్యకర్తలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. ఇదే జరిగితే.. జైలుకు వెళ్తోంది.. కార్యకర్తలు, నాయకులే. కనీసం వారిని పరామర్శించడంలోనూ.. న్యాయపరంగా రక్షణ కల్పించడంలోనూ..వైసీపీ అధినేత విఫలమవుతున్నారు.ఆయా విషయాలను గమనిస్తున్న వైసీపీ కార్యకర్తలు.. ఇప్పుడు ప్లేట్ మార్చేస్తున్నారు. టీడీపీ కానీ.. జనసేన కానీ..కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. సీఎం చంద్రబాబు సైతం..తన ప్రొటోకాల్ ను పక్కన పెట్టి మరీ.. కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కష్టాల్లో ఉంటున్నవారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. భరోసా కల్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వవైసీపీలో అలజడి రరేగింది. ఇంకా పార్టీని నమ్ముకుని ఇక్కడే ఉంటే కష్టమనిభావిస్తున్న వారు.. జెండా మార్చేసేందుకు రెడీ అయ్యారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక మంది కార్యకర్తలు.. గత రెండు రోజుల్లోనే టీడీపీ, జనసేనల బాటపట్టడం గమనార్హం

# క్రియాశీలక రాజకీయాల్లోకి భువనమ్మ..

**నెల్లూరు, ఏప్రిల్ 25, పెన్ పవర్:**

ప్రజా నాయకుడు.. లేదా నాయకురాలు.. కావడానికి జెండా పట్టుకునే తిరగాల్సిన అవసరం లేదని.. ఈ దేశంలో అనేక మంది నిరూపించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తూ.. ప్రజల మనసుల్లో చోటు దక్కించుకున్నవారు ఎందరో ఉన్నారు. అంత మాత్రాన వారు రాజకీయా ల్లో పాల్గొని పోటీ చేయాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి వారిలో నర్మదాబచావో(నర్మదా నదిని రక్షించండి) పేరుతో ఉద్యమించిన మేధా పాట్కర్ వంటివారు ఉన్నారు.ఇప్పుడు అలానే అప్రకటిత ప్రజానేతగా.. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వర నిలుస్తున్నారు. ఆమె.. ప్రజలకు చేరువ కావడం.. వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నారా వారి సొంత నియోజకవర్గం కుప్పంలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. నెలకు మూడు నుంచి నాలుగురోజుల పాటు అక్కడే ఉంటున్నారు. ఇక్కడ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. సాయం చేస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారు.అంతేకాదు.. ఒక్కకుప్పమే అయితే.. భువనేశ్వరి గురించి.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మం వరకు కూడా.. ఆమె తన ప్రజా ప్రస్థానాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కృష్ణాజి ల్లాలోని తన తండ్రి గ్రామం నిమ్మకూరులో పెద్ద ఎత్తున పాఠశాలను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి స్కాలర్ షిప్పులు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్టును మరింత బలోపే తం చేసి.. పేదలకు, సమాజంలో అణగారిన వర్గాలకు ఆసరా చూపిస్తున్నారు.ఇదంతా స్వచ్ఛంద సేవే కదా.. ప్రజానేత ఎలా అవుతారన్న ప్రశ్నలు సహజం. అయితే.. కేవలం స్వచ్ఛం ద సేవకు మాత్రమే భువనేశ్వరి పరిమితం కాలేదు. అవసరానికి తగిన విధంగా రాజకీయ అవతారం కూడా ఎత్తుతున్నారు. గత ఎన్నికల్లో ఊరూ వాడా ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా.. పీ4 పథకంపై

ఆమె అంతర్గతంగా పారిశ్రామిక వేత్తలతో చర్చిస్తున్నారు. వీరిలో మహిళా పారిశ్రామికవేత్తలను ఒప్పించే పనిలో ఉన్నారు. తద్వారా.. చంద్రబాబు ఆశయాలకు దన్నుగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. సో.. భువనేశ్వరి రాజకీయ నేత కాకపోవచ్చు.. కానీ, అప్రకటిత ప్రజానేతగా మాత్రం గుర్తింపు పొందుతున్నారనడంలో సందేహం లేదు. ఇటీవల కుప్పం డిగ్రీ కాలేజీలో భువనేశ్వరి ముఖాముఖిలో పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి యువతను నాశనం చేస్తోందన్నారు. "వారి స్వలాభం కోసం చాలా మంది మిమ్మల్ని టెంప్ట్ చేస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. రోల్ మోడల్ పెట్టుకోవాలి" అని విద్యార్థులకు సూచించారు. ప్రతి పురుషుని సక్సెస్ మహిళతోనే ముడి పడి ఉంటుందన్నారు. "కాలేజ్ డేస్ గుర్తుకు వస్తున్నాయి. ఆషామాషీగా వెళ్లి మీరందరూ చేసేదే నేను కూడా కాలేజ్‌లో చేసేదాన్ని. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది. ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అవర్ ఆంధ్రప్రదేశ్ లీడర్ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. మీ హక్కుకోసం నడవాలి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీకోసం సంపాదిస్తున్నారు. అది ఈజీ కాదు. హార్డ్ వర్క్. ఏదీ ఫ్రీగా రాదు. కష్టంతోనే వస్తుంది. బాలికలకు పట్టుదల, ధైర్యం, మీమీద నమ్మకం ఉండాలి. పెళ్లి అయ్యేదాకా ఒకటి, తర్వాత మరొకటి. రాజకీయాల్లో బిజినెస్‌లో నన్ను నేను లాక్కుని ముందుకు వెళ్ళాను. మన ధైర్యం మనకుండాలి" అని వెల్లడించారు.ముందు నందమూరి కుమార్తెను.. బాబు భార్య సెకండ్. ఒక మహిళగా నేనేమిటి అనేది నాకు తెలుసు. మనందరిలోనూ ఆ శక్తి ఉంది. ఫోకస్ పనిలోపెడితే ముందుకు వెళ్ళచ్చు. హౌస్ వైఫ్ ఉన్నప్పుడు హెరిటేజ్ చూసుకోమన్నారు. నాకే ఏమీ తెలియదు. ఎండీగా బాధ్యతలు ఇచ్చారు. అందరినీ ఒకటే అనుకున్నాను. జీవితాలు బాగుంటాయి. హార్డ్ వర్క్ మీద నమ్మకం పెట్టాలి. నాన్నకంటే గొప్పవాడివి కావాలి. చేయకపోతే నీ ఫ్యూచర్ ఆగుతుంది అని నా కుమారునికి చెప్పా.

మీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది. ఎవరూ రారు. బద్ధకం ఉంటే జీవితంలో ఎదగలేరు. మీరే ఫ్యూచర్ లీడర్స్, ఏ రంగంలోనైనా. డిసిప్లిన్ ముఖ్యం. నాకు డిసిప్లిన్ ఎక్కువ. స్ట్రిక్ట్ నెస్ లేకపోతే నేను ముందుకు వెళ్లలేను. ఉద్యోగాలకు, ఆర్గనైజేషన్ టీమ్ వర్క్ ఉండాలి. అందరూ మనమే అంటేనే భవిష్యత్తు. సంతోషంగా కార్యక్రమం చేపట్టాలి. జీవితంలో టీచర్స్‌ను మరచిపోవద్దు. రెస్పెక్ట్ ఇవ్వాలి వారికి. అందరిలో ఉంటాయి తప్పులు. ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు మనల్ని చూపిస్తాయి. ఇవన్నీ ఎదుర్కొన్నాను నేను. వ్యాపారం, ఉద్యోగం అన్నింటిలోనూ ఆడపిల్ల దేనిలోనూ తక్కువకాదు. నా జీవితంలో చూస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ మిమ్మల్ని మీ కుటుంబం నుంచి దూరం చేస్తుంది. కుటుంబానికి ఇంపార్టెన్స్ ఇవ్వండి. ఫోన్లు, సోషల్ మీడియా కుటుంబాలకు దూరం అవుతున్నారు" అని తెలిపారు.

## ఏపీఎస్సీఎస్సీలో 18 నోటిఫికేషన్లు

**విజయవాడ, ఏప్రిల్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీలో ఉద్యోగ నియామక ప్రక్రియలో వేగం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్న నోటి ఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. ఈ ఏడాది జనవరిలోనే నోటిఫికేషన్లు జారీ చేయాలని భావించినా ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చక పోవడంతో నోటిఫికేషన్లు ఆలస్యమయ్యాయి.ఏపీ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 866 పోస్టుల భర్తీకి సంబంధించి 18 నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అటవీ శాఖకు సంబంధించి 814 పోస్టులున్నాయి.ఎస్సీ వర్గీకరణకు తగ్గట్లు అన్ని శాఖల్లో రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ కసరత్తు పూర్తవగానే ఏపీపీఎస్సీ నోటి ఫికేషన్ల జారీ చేయాలని భావిస్తోంది.

శాఖల వారీగా భర్తీ చేయనున్న ఉద్యోగాలుఅటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 100 ఉన్నాయి. వీటిలో 30 పోస్టులు క్యారీ పార్వర్డ్ పోస్టులుగా ఉ్నయి.అటవీ శాఖలో బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు 691 ఉన్నాయి. వీటిలో 141 క్యారీ ఫార్వర్డ్ పోస్టులు ఉన్నాయి.

డ్రాఫ్ట్స్ మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్: పోస్టులు 13 ఉన్నాయి.వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు 10, దేవాదాయ శాఖలో ఈవో పోస్టులు 7, జిల్లా సైనిక సంక్షేమ అధికారుల పోస్టులు 7, ఇంటర్మీడియట్ విద్యలో లైబ్రేరియన్ పోస్టులు 2, ఉద్యానశాకలో హార్టికల్చర్ పోస్టులు 2, మత్స్య శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 2, భూగర్భ జలశాకలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు 2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాటగిరీ 2 పోస్టులు 2, మునిసిపల్ శాఖలో సీనియర్ అకౌంటెంట్ పోస్టులు 11, టైపిస్ట్ పోస్టులు 1, అసిస్టెంట్ మోటర్ వెహికల్ పోస్టులు 1 ఉన్నాయి. వీటితో పాటు పలు క్యారీ ఫార్వార్డ్ పోస్టులు ఉన్నాయి.

## అమల్లోకి ఇంటర్ బోర్డులో సంస్కరణలు

**గుంటూరు, ఏప్రిల్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఐదు సబ్జెక్టులకు బదులు ఆరు సబ్జెక్టులను ఎంచుకోవల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో తీసుకువచ్చిన అనేక సంస్కరణలపై సందేహాలు వ్యక్తమవుతుండటంతో బోర్డు ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఫస్ట్ ఇయర్‌లో పార్ట్ 1 కింద ఇంగ్లిస్ సబ్జెక్టు ఉంటుంది. పార్ట్ 2 కింద తెలుగు, సంస్కృతం, అరబిక్ ఇలా భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు సబ్జెక్టులు కూడా ఉంటాయి.పార్ట్ 3లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి ఎంపీసీ గ్రూపు ఎంపిక చేసుకుంటే గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అయితే విద్యార్థి ఎంపీసీ గ్రూపు తీసుకొని గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లిష్, తెలుగు చదువుతూ ఆరో సబ్జెక్టుగా జీవశాస్త్రం తీసుకున్నాడనుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఉండదన్నమాట. అంతేకాకుండా ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టులు పాసైనట్లు మెమో ఇస్తారు. ఒకవేళ ఆరో సబ్జెక్టులోనూ పాసైతే ప్రత్యేకంగా మరో మెమో జారీ చేస్తారు.కానీ పార్ట్2లో తెలుగు, సంస్కృతం, అరబిక్‌లాంటి భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు ఆప్షనల్ సబ్జెక్టులు కలిపి మొత్తం 24 వరకు ఉంటాయి. వీటిల్లో ఏ సబ్జెక్టునైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎంపీసీ విద్యార్థి గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆంగ్ల భాష సబ్జెక్టుతోపాటు జీవశాస్త్రాన్ని ఎంపిక చేసుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత తప్పనిసరన్నమాట. వీళ్లు జేఈఈతోపాటు నీట్ పరీక్ష కూడా రాసుకోవచ్చు. ఒకే కోర్సులో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివేందుకు అర్హత లభిస్తుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టడంతోపాటు ప్రశ్నపత్రాల విధానాన్ని మార్పు చేశారు. గతంలోలానే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉంటాయి. వీటిల్లో పార్ట్ 2లో ఎంపిక చేసిన సబ్జెక్టును చదువుకోవచ్చు. వీటితోపాటు విద్యార్థి ఆసక్తి మేరకు అదనంగా ఆరో సబ్జెక్టు చదువుకోవడానికి వీలుంటుంది.

## బాలినేనికి చిక్కని పట్టు



**ఒంగోలు, ఏప్రిల్ 25, పెన్ పవర్:** మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు. జిల్లాపై పట్టున్న నేతగా... బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాలినేని పని చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు.దీంతో బాలినేని సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేసి నడిచారు. ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి జగన్ కేబినెట్‌లో స్థానం సంపాదించారు. రెండున్నరేళ్ల తర్వాత జగన్ కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో మంత్రి పదవిని బాలినేని కోల్పోయారు.అయితే వైఎస్ జగన్ కుటుంబంతో బాలినేనికి సమీప బంధుత్వం ఉంది. అయినా ఆయన్ని కేబినెట్ నుంచి తొలగించడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యారనే గట్టి ప్రచారం అయితే జిల్లా గట్టిగానే సాగింది. అందువల్లే నాటి నుంచి పార్టీ అధిష్టానానికి ఆయన సాధ్యమైనంత దూరంగా ఉన్నారనే చర్చ సైతం సాగింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరమైంది. ఎమ్మెల్యేగా సైతం బాలినేని ఓటమి పాలయ్యారుపార్టీ వీడేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ వద్ద కుండ బద్దలు కొట్టారు. బాలినేనికి నచ్చ జెప్పేందుకు పార్టీ అధినేతే కాదు.. అగ్రనేతలు సైతం ప్రయత్నించారు. కానీ బాలినేని మాత్రం వారి సూచనలు సలహాలు పట్టించుకోలేదు

# రో - కో సూపర్ ఫామ్.. ఫ్యాన్స్ రీఎంట్రీ అడిగేలా..



**హైదరాబాద్ పెన్ పవర్:** గతేడాది టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా కైవసం చేసుకుంది. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్ రోహిత్ శర్మ. ఇక ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన ఆటగాడు విరాట్ కోహ్లీ. అనూహ్యంగా వీరిద్దరూ ఆ వెంటనే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేశారు. అంతా షాక్.. ఎందుకలాంటి నిర్ణయం తీసుకున్నారనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఐపీఎల్‌లో వారి ఆటతీరు చూశాక.. కాస్త తొందరపడ్డారేమో అనిపిస్తోంది.

**విరాట్ ఇలా...**

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులోకి విరాట్ కోహ్లీ దూసుకొచ్చాడు. ప్రస్తుతం 392 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తొమ్మిది మ్యాచుల్లో 65.33 సగటుతో పరుగులు చేయడం గమనార్హం. గత టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో కోహ్లీ 76 పరుగులు చేశాడు. మిగతా ఏడు మ్యాచుల్లో చేసినవి కేవలం 75 కావడం గమనార్హం. ఆ తర్వాత ఆడిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున రెండో టాప్ స్కోరర్. అది వన్డే ఫార్మాట్. కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకోవచ్చు. కానీ, తీవ్ర పోటీ ఉండే ఐపీఎల్‌లో తొలి బంతి నుంచే బాదుడు మొదలుపెట్టాలి. ఈ విషయంలో కోహ్లీ ఒకేసారి రెండు రకాల పాత్రలను పోషించాడు. వికెట్ పడినప్పుడు లేదా సహచర బ్యాటర్ ఎటాకింగ్‌కు వెళ్లినప్పుడు తాను యాంకర్ పాత్ర పోషించాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో దూకుడూ ప్రదర్శించాడు. తాజాగా రాజస్థాన్‌పైనా కీలకమైన ఇన్నింగ్స్‌తో కోహ్లీ అదరగొట్టాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో కోహ్లీ తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపాలనే ఏకైక లక్ష్యంగా ఆడుతున్నట్లు కనిపిస్తోందని మాజీల అభిప్రాయం. ప్రతి మ్యాచ్‌లోనూ గెలుపు కసి అతడిలో కనిపిస్తోంది.

**రోహిత్ అలా..**

విరాట్‌తో పోలిస్తే రోహిత్ శర్మ ఆటతీరు పూర్తి భిన్నం. ఇద్దరూ ఓపెనర్లుగా వస్తున్నారు. కానీ, విరాట్ ప్రతి బంతిని స్టాండ్స్‌లోకి పంపిద్దామని భావించడు. రోహిత్ మాత్రం మొదటి బంతి నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడేస్తాడు. అది కొన్నిసార్లు జట్టుకు మంచి చేసినా.. త్వరగా పెవిలియన్‌కు చేరడం వల్ల వ్యక్తిగతంగా ఎలాంటి ఘనతలు అందుకోలేకపోతుంటాడు. ఈసారి ఐపీఎల్‌లో కూడా రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగుతున్నాడు. ఒక మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. తొలి ఆరు మ్యాచుల్లో అతడు చేసిన పరుగులు 82 పరుగులు. ఇందులో ముంబయి గెలిచినవి మూడు. ఎప్పుడైతే వరుసగా రెండు హాఫ్ సెంచరీలు చేశాడో.. అక్కడ్నుంచి ముంబయి ప్లేఆఫ్స్ రేసులో ముందుకొచ్చింది. గత రెండు మ్యాచుల్లోనూ ఆ జట్టు విజయం సాధించింది. రోహిత్ వరుసగా 76, 70 పరుగులు చేసి జట్టును గెలిపించాడు.

**ఆ మాటతో.. ఆశలు**

ప్రస్తుతం రోహిత్, విరాట్ ఫామ్‌ను చూస్తుంటే.. అసలు వీరెందుకు టీ20లను వదిలేశారా? అనిపిస్తోంది. అయితే, గత ఏడాది కొన్ని మ్యాచుల్లో వారి ఆటను చూశాక విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఫామ్ తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం అనే నానుడి ఇప్పుడు రోహిత్ – కోహ్లీకి సరిగ్గా సరిపోతుంది. రోహిత్ వయసు మరో ఐదు రోజుల్లో 38 ఏళ్లకు చేరుతుంది. కోహ్లీ వయసు ఇంకా 36 ఏళ్లే. గతంలో 40 సంవత్సరాలు వచ్చినా మంచి ఆటతీరు ప్రదర్శించిన క్రికెటర్లను చూశాం. ఇటీవల విరాట్ ఓ మాట అన్నాడు.. ఒలింపిక్స్‌లో టీమ్ఇండియా ఫైనల్‌కు చేరితే తాను ఆడేందుకు సిద్ధంగా ఉంటానన్నాడు. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028లో ఒలింపిక్స్ జరుగుతాయి. ఇందులో క్రికెట్‌కు చోటు దక్కిన సంగతి తెలిసిందే. అంటే మరో మూడేళ్లపాటు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ వెళ్తానని పరోక్షంగా చెప్పినట్లైంది. ఇక రోహిత్ విషయంలో స్పష్టత లేదు. హిట్‌మ్యాన్ తన రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకోవడం అసాధ్యమే. ఎన్ని సాధించినా వన్డే ప్రపంచ కప్ గెలిస్తేనే అసలైన మజా వస్తుందని ఇప్పటికే రోహిత్ తన మనసులోని మాట వెల్లడించాడు. అంటే, మరో రెండేళ్ల తర్వాత (2027) జరగబోయే వన్డే కప్ కోసం ఇప్పట్నుంచే రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పుడు వీరిద్దరి ఆటతీరు చూశాక.. వచ్చే ఏడాది పొట్టి కప్ బరిలోకి దిగాలని కోరుకునేవారూ లేకపోలేదు. మరి రో – కో ఏం చేస్తారో చూడాలి మరి..!

# కోహ్లీ గొప్పదనం గురించి మాట్లాడేంత వాడ్ని కాదు: దినేశ్ కార్తీక్

- ఐపీఎల్ తాజా సీజన్ లో రాణిస్తున్న కోహ్లీ
- కోహ్లీ ఆట పట్ల తపన, పట్టుదలపై దినేష్ కార్తీక్ ప్రశంసలు
- 18 ఏళ్లుగా ఐపీఎల్‌లో కోహ్లీ నిలకడను కొనియాడిన డీకే
- కోహ్లీని 'సంపూర్ణ ఛాంపియన్' అని అభివర్ణించిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ తాజా సీజన్ లో ఆర్సీబీ స్టార్ విరాట్ కోహ్లీ సూపర్ ఫామ్ లో ఉన్నాడు. అతడి సగటు కూడా ఇతర క్రికెటర్ల కంటే మెరుగ్గా ఉంది. గతరాత్రి రాజస్థాన్ రాయల్స్ తో మ్యాచ్ లోనూ కోహ్లీ 70 పరుగులతో అదరగొట్టాడు. ఈ నేపథ్యంలో ఆర్సీబీ మెంటార్ దినేశ్ కార్తీక్ స్పందించాడు. కోహ్లీ ఘనతల గురించి మాట్లాడేంత వాడ్ని కాదు అని వినమ్రంగా వ్యాఖ్యానించాడు. "విరాట్ కోహ్లీ గురించి ఏమి చెప్పగలం? అతనిలో ఉన్న ఆకలి, పట్టుదల చూస్తుంటే మాటలు రావడం లేదు," అని కార్తీక్ ఫ్రాంచైజీ విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొన్నాడు. "18 ఏళు ఐపీఎల్ ఆడటం ఒక ఎత్తు అయితే, అన్ని సంవత్సరాల పాటు నిలకడగా రాణించడం మరో ఎత్తు" అని కోహ్లీ నిలకడను కార్తీక్ కొనియాడారు. సీజన్ ఆరంభంలో జరిగిన కొన్ని హోమ్ మ్యాచ్‌ల తర్వాత కోహ్లీ తన ఆటతీరుపై లోతుగా విశ్లేషించుకున్నాడని కార్తీక్ వెల్లడించారు. "'బహుశా నేను మరికొంచెం మెరుగ్గా ఆలోచించి ఉండాల్సింది' అని కోహ్లీ నాతో అన్నాడు. తన బ్యాటింగ్ చూసేందుకే ఎంతో మంది అభిమానులు స్టేడియానికి వస్తారనే విషయం అతనికి బాగా తెలుసు" అని కార్తీక్ తెలిపారు. "పరిస్థితులకు తగ్గట్టు అతను మారే విధానం, ఆటను అర్థం చేసుకునే తీరు అమోఘం. అయినా, కోహ్లీ గొప్పదనం గురించి మాట్లాడటానికి నేను చాలా చిన్నవాడిని. అతను ఒక సంపూర్ణ ఛాంపియన్" అని కార్తీక్ కొనియాడాడు.

# పహల్గాం ఎఫెక్ట్.. ఇక భారత్ - పాక్ ఒకే గ్రూప్‌లో తలపడవా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్‌లో భారత్ – పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. ఇక భవిష్యత్తులోనూ నిర్వహించే ప్రసక్తే లేదని ఇప్పటికే బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. కేవలం ఐసీసీ ఈవెంట్లలోనే తలపడుతున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో భారత్ – పాక్ జట్లను ఉంచితే టోర్నీకి ఆకర్షణగా ఉంటుందనే ఉద్దేశంతో ఐసీసీ నిర్ణయం తీసుకొనేది. అయితే, ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం పాకిస్థాన్‌తో గ్రూప్ స్టేజ్‌లో అస్సలు ఆడకూడదని టీమ్ఇండియా భావిస్తోందనే వార్తలు వచ్చాయి. ఈమేరకు ఐసీసీకి లేఖ రాసినట్లు కూడా తెలుస్తోంది. భవిష్యత్తులో (ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ) ఎప్పుడూ భారత్ – పాక్ జట్లను ఒకే గ్రూప్‌లో ఉంచొద్దని అందులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై బీసీసీఐ వర్గాలు స్పష్టత ఇవ్వడం లేదు.

క్రిక్‌బజ్ రిపోర్ట్ ప్రకారం టాప్ బీసీసీఐ అధికారులు ఆ దిశగా ఆలోచన చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. "దేశవ్యాప్తంగా ఉగ్రదాడిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలు వద్దనే డిమాండ్లూ వస్తున్నాయి. ఇదే విషయంపై బీసీసీఐ టాప్ ఆఫీస్ బేరర్ ఒకరు ప్రస్తావించారు. చాలా సున్నితమైన అంశం కాబట్టి చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకైతే అలాంటి వార్తల్లో నిజం లేదని భావిస్తున్నా. మున్ముందు ఏం జరుగుతుందో చెప్పలేం" అని బీసీసీఐ అధికారి పేర్కొన్నారు.

**ఇవి ఐసీసీ టోర్నీలు..**

ఈ ఏడాది ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ జరిగిన సంగతి తెలిసిందే. దీనికి పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. టీమ్ఇండియా మ్యాచులన్నీ దుబాయ్ వేదికగానే నిర్వహించారు. చివరికి భారత జట్టే ఛాంపియన్‌గా నిలిచింది. ఇక పురుషుల విభాగంలో ఈ సంవత్సరం ఐసీసీ ఈవెంట్ లేదు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉంది. ఐసీసీ టోర్నీ కాకపోయినా ఆసియా కప్ కూడా అభిమానులను ఆకట్టుకొనే టోర్నీనే. భారతే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మ్యాచులను తటస్థ వేదికపై నిర్వహించాలని బీసీసీఐ – ఏసీసీ భావిస్తున్నాయి. ఇక మహిళల ప్రపంచ కప్ సెప్టెంబర్ – అక్టోబర్‌లో జరగనుంది. పాకిస్థాన్ కూడా అర్హత సాధించింది. భారత్‌తో జరగనున్న మ్యాచులను తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? లేదా రద్దు చేస్తారా? అనేది తెలియదు.



**జ్యోతి పూర్వాజ్ చిక్ ఎత్నిక్ లుక్**

# తమన్నా ఇదే కరెక్ట్ రూట్ అనుకుంటే మాత్రం..!



**కంగనా శర్మ ఫ్యాషన్ హద్దులు దాటింది**



రెండు దశాబ్దాల నుంచి కథానాయికగా రాణించడం అన్నది చాలా పెద్ద టాస్క్. సౌత్ లో అలాంటి క్రేజ్ సంపాదించుకున్న అతి తక్కువ భామల్లో మిల్కీ బ్యూటీ తమన్నా కూడా ఉంటుంది. శ్రీ సినిమాతో మొదలైన ఆమె కెరీర్ ఇప్పటికీ తన పాత్రలతో అలరిస్తుంది. సినిమా పట్ల తమన్నాకి ఉన్న ప్యాషన్, అంకిత భావమే ఆమెను ఇక్కడిదాకా తీసుకొచ్చిందని చెప్పొచ్చు. ఒకప్పుడు స్టార్స్ అందరితో కలిసి నటించిన తమన్నా ఇప్పుడు సెలెక్టెడ్ సినిమాలు చేస్తుంది. బాలీవుడ్ లో వెబ్ సీరీస్ లతో కూడా అలరిస్తున్న అమ్మడు సౌత్ లో మాత్రం తన మార్క్ చాటే సినిమాలను ఎంపిక చేసుకుంటుంది. లేటెస్ట్ గా తమన్నా ఓదెల 2 సినిమాలో నటించింది. అశోక్ తేజ డైరెక్ట్ చేసిన ఈ సినిమాకు సంపత్ నంది అన్నీ తానై నడిపించాడు. ఓదెల కమర్షియల్ ఫ్యాక్టర్స్ ని పక్కన పెడితే తమన్నా చేసిన ఈ అటెంప్ట్ కి ఆడియన్స్ ఇంప్రెస్ అవుతున్నారు. అంతేకాదు తమన్నా ఈ రూట్ లోనే వెళ్తే బెటర్ అని భావిస్తున్నారు. ఓదెల 2 కథ ఇదివరకు చాలా సినిమాల కథలను పోలి ఉందన్న టాక్ ఉన్నా తమన్నా ఇలానే ఫిమేల్ సెంట్రిక్ కథలతో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేసే పాత్రలు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారు. తమన్నాలో ఉన్న అసలు నటి ఇలాంటి సినిమాలు చేసినప్పుడు మాత్రమే బయటకు వస్తుంది. ఐతే ఓదెల 2 సినిమా చేస్తున్న టైం లో తమన్నా కూడా ఇక మీదట లేడీ ఓరియెంటెడ్ సినిమాలే అది కూడా కాస్త డిఫరెంట్ గా ఉండేలా ప్లాన్ చేయాలని అనుకున్నదట. ఓదెల 2 అటెంప్ట్ కి తమన్నా వరకు మంచి మార్కులే పడ్డాయి. ఐతే నెక్స్ట్ సినిమాల్లో కథా బలం కూడా బాగుండే సినిమాలు చేస్తే తను పెట్టే ఎఫర్ట్ కి మించిన రిజల్ట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఇన్నేళ్ల కెరీర్ లో ఇప్పటికీ తమన్నాని లీడ్ రోల్ లో పెట్టి సినిమాలు చేస్తున్నారు అంటే అమ్మడి మార్కెట్ మీద నమ్మకం తో పాటు కంటెంట్ మీద ఉన్న కాన్ఫిడెంట్ కూడా ఉంటుంది. ఐతే తమన్నా నెక్స్ట్ ఇలాంటి ఫిమేల్ సెంట్రిక్ ప్రాజెక్ట్ లు చేసినా కాస్త జాగ్రత్త పడితే మళ్లీ కెరీర్ జోష్ తెచ్చే రిజల్ట్ అందుకునే ఛాన్స్ ఉంటుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com